విశాఖపట్టణం
మంగళవారం 25 ఆగస్టు 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 213 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# యుద్ధంలో రష్యా భారీ సన్నాహాలు: జెలెన్స్కీ

3 లక్షల మంది రష్యా కొత్త సైనికులు..

రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్న ఉక్రెయిన్ - రష్యా యుద్ధం

తమపై విరుచుకుపడేందుకు రష్యా సన్నాహాలు చేస్తోందని ఆరోపణ

ఆయుధ సంపత్తిని భారీగా పెంచుకుంటోందని విమర్శ



2



## జంతర్ మంతర్ ప్రొటెస్ట్

మహిళా నిరసనకారుల ఫిర్యాదులకే

మొదటి ప్రాధాన్యత: సుప్రీంకోర్టు

మహిళల ఫిర్యాదులకే మొదటి ప్రధాన్యత ఇవ్వాలని విచారణ కమిటీకి సీజేఐ ఆదేశం

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

జంతర్ మంతర్ నిరసనకారులపై పోలీసులు బలప్రయోగం చేశారనే ఆరోపణలపై విచారణ జరుపుతున్న ఉన్నత స్థాయి కమిటీకి సోమవారం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా పోరాడుతున్న సమయంలో మహిళా నిరసనకారులపై జరిగిన లైంగిక వేధింపుల ఫిర్యాదులకే మొదటి ప్రధాన్యత ఇవ్వాలని సదరు కమిటీని కోరినట్లు భారత ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది శోభా గుప్త తన వాదనలు వినిపించారు. "నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా పోరాడుతున్న సమయంలో కొంత మంది బాలికలు తాము లైంగిక వేధింపులకు గురయ్యామని చెబుతున్నారు. సోషల్ మీడియాలో కూడా ఇలాంటి వార్తలు వస్తున్నాయి. అందుకే ఈ విషయాన్ని సుమోటోగా విచారణకు స్వీకరించాలని నేను ధర్మాసనాన్ని కోరుతున్నాను" అని సీనియర్ న్యాయవాది శోభా గుప్తా పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు, ..మిగతా 2లో

# రైతులను పారిశ్రామికవేత్తలుగా చూడటమే ప్రభుత్వ లక్ష్యం

## రైతులే పారిశ్రామికవేత్తలు కావాలి.. గౌర్మే పాప్‌కార్న్ ఒక విప్లవం: సీఎం చంద్రబాబు

దేశంలో తొలి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ విత్తనాన్ని అభివృద్ధి చేసిన గోర్మే సంస్థ

సీడ్ ను ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు

11 ఏళ్లలో 69% మార్కెట్ వాటాతో గోర్మే అద్భుత విజయం సాధించిందన్న సీఎం

రైతులను పారిశ్రామికవేత్తలుగా చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం

ఫుడ్ ప్రాసెసింగ్‌పై యువత దృష్టి పెట్టాలని చంద్రబాబు పిలుపు

చింతలపూడి పథకం పూర్తి చేసి నూజివీడు రూపురేఖలు మారుస్తామని హామీ




ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

వ్యవసాయాన్ని కేవలం జీవనోపాధిగా కాకుండా ఒక ఆర్థిక శక్తిగా చూడాలని, రైతులను పారిశ్రామికవేత్తలుగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దేశంలోనే మొట్టమొదటి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని అభివృద్ధి చేసిన 'గౌర్మే పాప్‌కార్నికా' సంస్థ ఒక వినూత్న విప్లవానికి శ్రీకారం చుట్టిందని ఆయన కొనియాడారు. ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌తో కలిసి నూజివీడు సమీపంలోని ముసునూరులో జరిగిన గౌర్మే సంస్థ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు, కొత్తరకం పాప్ కార్న్ సీడ్ ను ఆవిష్కరించారు. సంస్థ విజయగాథను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళతామని ఆయన ఉద్ఘాటించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ఒకప్పుడు మన దేశంలో అమ్ముడైన ప్రతి ..మిగతా 2లో

# కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశం

ఏపీ, తెలంగాణ వాదనలు

ఏపీ, తెలంగాణ ఈఎన్సీలూ హాజరు

సాగర్, శ్రీశైలం నీటి వినియోగంపై చర్చ

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

హైదరాబాద్ జలసౌధలో కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో ఏపీ, తెలంగాణ ఈఎన్సీలూ హాజరయ్యారు. సాగర్, శ్రీశైలం నీటి వినియోగంపై చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకు కృష్ణా జలాలను వినియోగించాలని ఏపీ కోరింది. పల్నాడు, రాయలసీమ ప్రాంతాలకు తాగునీటిని విడుదల చేయాలని కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ కోరడంతో రెండుసార్లు వాయిదా తర్వాత సోమవారం భేటీ జరిగింది. అయితే కమిటీ ఎలాంటి ..మిగతా 2లో




## అయోధ్య కాంగ్రెస్ విందులో చేపల కూరపై రాజకీయ దుమారం

మత విశ్వాసాలను దెబ్బతీశారంటూ బీజేపీ, సీఎం యోగి ఫైర్

సమస్యల నుంచి దారి మళ్లించేందుకేనని కాంగ్రెస్ ఎదురుదాడి

తాను చేపలు తిన్నట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానన్న అజయ్ రాయ్



ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

అయోధ్యలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన ఒక విందు కార్యక్రమం ప్రస్తుతం తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. ఈ విందులో చేపల కూర వడ్డించడమే వివాదానికి కేంద్రబిందువుగా మారింది. ఈ వ్యవహారంపై అధికార బీజేపీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తుండగా, కాంగ్రెస్ పార్టీ కూడా ..మిగతా 2లో



## ముగిసిన సాదిక్ ఖాన్ విచారణ

నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడి ప్రాథమిక విచారణ పూర్తి

సర్పవరం పోలీస్ స్టేషన్‌లో నిందితుడిని విచారించిన ప్రత్యేక బృందం

ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

కాకినాడ జిల్లావ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న షేక్ సాదిక్ ఖాన్ పోలీసుల ప్రాథమిక విచారణ ముగిసింది. సర్పవరం పోలీస్ స్టేషన్‌లో సుదీర్ఘంగా సాగిన ..మిగతా 2లో

# ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు

విజయ్ సర్కార్ భారీ ప్రకటనలు..

ఏడాదికి 3 ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించనున్న తమిళనాడు ప్రభుత్వం

2027 సంక్రాంతి నుంచి 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' అమలు

రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు పథకం వర్తింపు

మహిళలకు ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించిన విజయ్



ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సోమవారం పలు కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు. ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించే పథకంతో పాటు ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు.

'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పేరుతో గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లోకి రానుంది. 2027 సంక్రాంతి నుంచి దీనిని ప్రారంభించనున్నారు. ఏటా రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.

అర్హులైన కుటుంబాలు కొనుగోలు చేసే మూడు గ్యాస్ సిలిండర్ల ఖర్చును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ పథకానికి ఏటా సుమారు రూ.4,000 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం ..మిగతా 2లో

## శ్రావణమాసం... మూడో శుక్రవారం

కొత్త పార్టీని ప్రకటిస్తా: విజయసాయిరెడ్డి


పార్టీ పేరు, జెండా, విధివిధానాలపై క్లారిటీ ఇచ్చిన విజయసాయిరెడ్డి

విజయవాడ వేదికగా పూర్తి వివరాలను వెల్లడిస్తానన్న విజయసాయి

ప్రజల గొంతుక వినిపించేందుకు ప్రతిపక్ష హోదా అక్కర్లేదని వ్యాఖ్య

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

తాను కొత్త పార్టీని ప్రారంభించపోతున్నట్టు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ విషయానికి సంబంధించి ఆయన ఈరోజు మరింత క్లారిటీ ఇచ్చారు. శ్రావణమాసం ..మిగతా 2లో



For a pure tomorrow.. జయహే

# రైతులను పారిశ్రామికవేత్తలుగా చూడటమే ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

పాప్‌కార్న్ గింజపై మనం ఖర్చు చేసిన డబ్బులో 70 శాతానికి పైగా బ్రెజిల్, అర్జెంటీనా వంటి దేశాలకు వెళ్లేది. కానీ, గౌర్మే సంస్థ కృషితో ఇప్పుడు ఆ 70 శాతం ఆదాయం మన దేశ రైతులకే దక్కుతోంది. కేవలం 11 ఏళ్లలో ఈ సంస్థ దేశానికి 125 మిలియన్ అమెరికన్ డాలర్ల (దాదాపు రూ.1000 కోట్లకు పైగా) విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసింది. ఇది మనందరికీ గర్వకారణం" అని ప్రశంసించారు.

2014లో ప్రారంభమైన ఈ సంస్థ, నేడు ఆసియాలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ కేంద్రంగా ఎదగడం, 8 రాష్ట్రాల్లో 17,500 మంది రైతులతో 40,000 ఎకరాల్లో సాగు చేస్తూ దేశంలోని 3,400 సినిమా థియేటర్లకు పాప్‌కార్న్‌ను సరఫరా చేయడం అసాధారణ విజయమని కొనియాడారు. సంస్థ ఎండీ పట్టాభిరామారావు గారి కుటుంబానికి వ్యాపార దక్షత, రైతులను ఆదుకునే వారసత్వం ఉన్నాయని గుర్తుచేశారు.

వ్యవసాయ రంగంలో విలువ జోడింపు ప్రాధాన్యతను వివరిస్తూ, "ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా, అరటి, మామిడి, మిరప, పసుపు, పామాయిల్ వంటి ఎన్నో వాణిజ్య పంటలు పండుతున్నాయి. అయితే, వాటిని ప్రాసెస్ చేసి, బ్రాండ్ సృష్టించి అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లినప్పుడే రైతు రాజుగా ఎదుగుతాడు. గౌర్మే సంస్థ పొలం నుంచి వినియోగదారుడి వరకు ట్రేసబిలిటీతో ఒక పక్కా వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇదే మోడల్‌ను రాష్ట్రంలోని ఇతర పంటలకు కూడా




వర్తింపజేయాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

ప్రస్తుతం రాష్ట్రం నుంచి ఎగుమతి అవుతున్న ఆక్వా ఉత్పత్తుల్లో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెస్ అవుతోందని, దీనిని 60-70 శాతానికి పెంచగలిగితే ఉపాధి అవకాశాలు, విదేశీ మారక ద్రవ్యం భారీగా పెరుగుతాయని విశ్లేషించారు.

రాష్ట్రంలో నీటి భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. "ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో 52 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. అయినప్పటికీ, గతంలో నిర్మించిన పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి రైతులను కొంతవరకు ఆదుకోగలిగాం. నూజివీడు ప్రాంత భవిష్యత్తును మార్చే చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును న్యాయపరమైన అడ్డంకులు తొలగించి త్వరలోనే పూర్తి చేస్తాం. దశాబ్దాల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ఈ ఆగస్టు 31న జాతికి అంకితం చేస్తున్నాం. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నీటిని అందిస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు.

దేశంలోని నదుల అనుసంధానం ఆవశ్యకతను నొక్కిచెబుతూ, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఈ ఆశయానికి మద్దతునివ్వడం అభినందనీయమన్నారు. "గోదావరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, కావేరి నదులను అనుసంధానిస్తే నాలుగు దక్షిణాది రాష్ట్రాల నీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయి. ఇదే స్ఫూర్తితో గంగ-బ్రహ్మపుత్ర నదుల నీటిని కూడా సద్వినియోగం చేసుకోగలిగితే దేశ భవిష్యత్తు అప్రతిహతంగా ముందుకు సాగుతుంది" అని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, పది మందికి ఉద్యోగాలు ఇచ్చే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. టెక్నాలజీని వ్యవసాయంతో అనుసంధానించి ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి వస్తే ఆకాశమే హద్దుగా రాణించవచ్చని సూచించారు. గౌర్మే సంస్థ చూపిన 'అవుట్ ఆఫ్ బాక్స్' ఆలోచనా విధానం రాష్ట్రంలోని యువతకు స్ఫూర్తిదాయకమని, ఇలాంటి వినూత్న స్టార్టప్‌లకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధంలో రష్యా భారీ సన్నాహాలు: జెలెన్‌స్కీ

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

ఉక్రెయిన్-రష్యా మధ్య పోరు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్న వేళ, ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ కీలక వ్యాఖ్యలు చేశారు. తమపై విరుచుకుపడేందుకు రష్యా పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తోందని, అందులో భాగంగా కొత్తగా దాదాపు 3 లక్షల మంది సైనికులను సమీకరించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తోందని ఆయన ఆరోపించారు. డొనెట్స్క్ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకోవడమే లక్ష్యంగా మాస్కో అడుగులు వేస్తోందని జెలెన్‌స్కీ తెలిపారు. సెప్టెంబరులో రష్యా పార్లమెంటరీ ఎన్నికలు ముగిసిన అనంతరం ఈ కొత్త బలగాల సమీకరణ ప్రక్రియ ఊపందుకుంటుందని అన్నారు. ఈ ఏడాది ఆరంభం నుంచి రష్యా పెద్ద సంఖ్యలో సైనికులను కోల్పోయినప్పటికీ, తన ఆయుధ సంపత్తిని భారీగా పెంచుకుంటోందని చెప్పారు. రష్యా ప్రస్తుతం ఏటా సుమారు 1,300 బాలిస్టిక్ క్షిపణులను తయారు చేసే స్థాయికి చేరుకుందని ఆరోపించారు. యుద్ధానికి ముగింపు పలికే దిశగా వచ్చే వేసవి కాలం నాటికి శాంతి చర్చలు జరిగే అవకాశం ఉండవచ్చని జెలెన్‌స్కీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు

మొదటి పేజీ తరువాయి...

అంచనా వేసింది. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులతో గ్యాస్ కొరత, ధరల పెరుగుదల కుటుంబాలపై అదనపు భారాన్ని మోపాయని విజయ్ తెలిపారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం పరిధిని ప్రభుత్వం విస్తరించింది. ఇకపై సాధారణ బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్, ఎల్ఎస్ఎస్, డీలక్స్ బస్సుల్లోనూ మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. జిల్లాల మధ్య నడిచే బస్సుల్లోనూ ఈ సదుపాయం కల్పించనున్నారు. 'వెట్రి పయనం' పేరుతో అక్టోబర్ 2 నుంచి ఈ విస్తరణ అమల్లోకి వస్తుంది. ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు విజయ్ ప్రకటించారు. చెన్నై సమీపంలోని పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టుపై విజయ్ మరోసారి తన వ్యతిరేకతను స్పష్టం చేశారు. ప్రాజెక్టుతో ప్రభావితమయ్యే కుటుంబాల పక్షాన నిలుస్తామని చెప్పారు. ప్రత్యామ్నాయ ప్రాంతాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుత మీనంబాక్కం, చెన్నై విమానాశ్రయంలోని కొత్త టెర్మినల్-5 నిర్మించనున్నట్లు కూడా ప్రకటించారు.

# 27న 'ఖేలో ఇండియా సంవాద్' కార్యక్రమం

నరసరావుపేట, ఆగస్టు 24 (జయ జయహే )



జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేరా యువ భారత్, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఖేలో ఇండియా సంవాద్ -- ఖేల్ కీ బాత్ పీఎం కే సాత్" కార్యక్రమం పల్నాడు జిల్లాలోని మామ్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ మరియు ఏఎం రెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కాలేజీలలో ఘనంగా నిర్వహించనున్నారు అని ఉమ్మడి గుంటూరు జిల్లా మేరా యువ భారత్ ఉపసంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలోని రెండు కళాశాలల్లో ఒకేసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అలాగే ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ ప్రసంగాన్ని విద్యార్థులు, యువత ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించనున్నారు అని అలాగే స్థానిక క్రీడాకారులతో చర్చ, ప్రజాప్రతినిధుల ప్రసంగాలుతో పాటు జరిగే యువ సంవాద్ కార్యక్రమంలో యువత అభిప్రాయాలు, ఆలోచనలు, ఆకాంక్షలను, క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, 2036 ఒలింపిక్స్‌కు ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దడం, క్రీడల ద్వారా యువతలో నాయకత్వం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి పెంపొందించడం వంటి అంశాలపై చర్చించనున్నారు అని అలాగే వికసిత్ భారత్ఏ2047 లక్ష్య సాధనలో యువత పాత్ర, యువతకు నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ మరియు ఆర్థిక పరిజ్ఞానం, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం, మేరా యువ భారత్ ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై కూడా యువత తమ అభిప్రాయాలను వెల్లడించే ఈ కార్యక్రమంలో భాగంగా యువతను మేరా యువ భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకునేలా ప్రోత్సహించడంతో పాటు, వారి సూచనలు డిజిటల్‌గా అందించేందుకు వేదిక వద్దూ= కోడ్ సదుపాయం కల్పించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పల్నాడు జిల్లాలోని విద్యార్థులు, యువత క్రీడలు, ఫిట్‌నెస్, యువజన నాయకత్వం మరియు దేశ నిర్మాణం లో భాగం అవుతారు అని పేర్కొన్నారు

# ముగిసిన సాదిక్ ఖాన్ విచారణ

మొదటి పేజీ తరువాయి...

విచారణ అనంతరం, నిందితుడిని వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. కాసేపట్లో అతడిని న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు. వివరాల్లోకి వెళితే, నూకరాజు కుటుంబం ఆత్మహత్య తర్వాత పరారీలో ఉన్న సాదిక్ ఖాన్‌ను పోలీసులు ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని రైలు మార్గం ద్వారా కాకినాడ జిల్లా మేడపాడుకు, అక్కడి నుంచి కట్టుదిట్టమైన భద్రత మధ్య సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం నిందితుడిని విచారించింది. అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో ఐదుగురు సీఐలతో కూడిన ఈ బృందం.. సోమవారం ఉదయం నుంచి సాదిక్ ఖాన్‌ను పలు కోణాల్లో విచారించింది. ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులు, నిందితుడి పాత్రపై కీలక వివరాలు రాబట్టినట్లు సమాచారం. విచారణ ప్రక్రియ పూర్తికావడంతో, పోలీసులు అతడిని వైద్య పరీక్షల నిమిత్తం కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి (జీజీహెచ్) తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు పూర్తయిన వెంటనే న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశం

మొదటి పేజీ తరువాయి...

నిర్ణయం తీసుకోలేదు. సెప్టెంబర్ 4న మరోసారి భేటీ కావాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏపీ ఈఎన్సీ నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ సంవత్సరం మొత్తం నీటి వినియోగంపై తెలంగాణ ప్రతిపాదన చేసిందని తెలిపారు. అక్టోబర్ వరకు నీటి కేటాయింపులు కోరామని ఆయన చెప్పారు. ఏపీకి 47 టీఎంసీ నీళ్లను అడిగామన్నారు. ఇందుకు తెలంగాణ అభ్యంతరం తెలిపిందన్నారు. పోతిరెడ్డి పాడు నుంచి 22 టీఎంసీలకు తెలంగాణ అంగీకరించిందని ఏపీ ఈఎన్సీ నరసింహమూర్తి స్పష్టం చేశారు. తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు నీటి వినియోగంపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిపారు. 10 టీఎంసీల నీటిని ఇప్పటికే ఏపీ వినియోగించుకుందని ఆరోపించారు. అంతేకాదు కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేసినట్లు రమేశ్ బాబు పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34% రిజర్వేషన్ పై హర్షం - కాండ్రేగుల చందు

మునగపాక, ఆగస్టు 24, జయ జయహే:



స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34% రిజర్వేషన్ అమలు కై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు తెలిపారు. సోమవారం నాగులాపల్లి లోని తన కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 139 బీసీ కులాలలో కేవలం 10 శాతం ఆధిపత్య కులాలకు చెందిన వారే స్థానిక సంస్థల్లో ఇప్పటివరకు లబ్ది పొందుతున్నారన్నారు. బీసీ ల్లో ఉన్న అన్ని కులాలకు అధికార పార్టీతో పాటు అన్ని పార్టీలు అవకాశాలు ఇవ్వాలని కోరారు. సామాజిక న్యాయం కోరుతూ చేస్తున్న పోరాటాలను ప్రభుత్వం గుర్తించాలన్నారు.



# గవర్ల అనకాపల్లి బంగ్లా యూత్ నూతన కార్యవర్గం ఎన్నిక

మునగపాక, ఆగస్టు 24, జయ జయహే:

మునగపాక మండలంలోని తోటాడ శివారు గవర్ల అనకాపల్లి గ్రామంలో గల బంగ్లా యూత్ నూతన అధ్యక్షుడిగా కాండ్రేగుల వెంకటశేషులు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బొడ్డే శ్రీనివాసరావు, కార్యదర్శిగా దాడి అప్పారావును, సాయి కార్యదర్శిగా, దాడి తాతాజీని కోశాధికారిగా, బొడ్డేటి గణేష్ ను కార్యవర్గ సభ్యులుగా, తనకాల ప్రవీణ్, కాళ్ల నూకరాజు, రాపిడ్ జగదీష్, ఆళ్ల హనుమంతరావు, దాడి జగన్నాథరావు సోమవారం జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో ఎన్నుకున్నారు.



# ప్రజల గోడు.. ఎస్పీ భరోసా

రాజమహేంద్రవరం: జయ జయహే: ఆగస్టు 24

:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డి. నరసింహ కిషోర్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 35 ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ఎస్పీ స్వయంగా తెలుసుకున్నారు. ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి, సమస్యలను చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం అందించాలని ఆదేశించారు. ప్రజలకు పోలీసు వ్యవస్థపై మరింత నమ్మకం కలిగేలా ఫిర్యాదులపై తక్షణ స్పందనతో చర్యలు తీసుకోవాలని సూచించారు. నేటి కార్యక్రమంలో సివిల్ వివాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్, కొట్లాటలు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

# అయోధ్య కాంగ్రెస్ విందులో చేపల కూరపై రాజకీయ దుమారం

మొదటి పేజీ తరువాయి...

వాటిని అంతే దీటుగా తిప్పికొడుతోంది. ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అజయ్ రాయ్‌కు స్వాగతం పలికేందుకు అయోధ్యలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే, ఈ విందులో చేపల కూర వడ్డించడంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్రంగా స్పందించారు. పవిత్రమైన శ్రావణ మాసంలో, అది కూడా రామజన్మభూమి అయిన అయోధ్యలో చేపలను వడ్డించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ హిందువుల మనోభావాలను దెబ్బతీసిందని ఆయన ఆరోపించారు. ఒకవైపు హనుమాన్ గఢీలో పూజలు నిర్వహిస్తూనే, మరోవైపు చేపల విందును ఆస్వాదించడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ధ్వజమెత్తారు. బీజేపీకి చెందిన ఇతర నేతలు సైతం కాంగ్రెస్‌కు మతంపై కనీస గౌరవం లేదని విమర్శించారు. బీజేపీ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ప్రశ్నాపత్రాల లీకేజీలు, రామాలయ విరాళాల్లో జరిగిన అక్రమాలు వంటి కీలక అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీజేపీ ఈ వివాదాన్ని సృష్టిస్తోందని కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ మాట్లాడుతూ, తాను పూర్తి శాఖాహారినని స్పష్టం చేశారు. తాను చేపలు తిన్నట్లు ఒక్క ఫొటో చూపించినా తన పదవికి రాజీనామా చేస్తానని, నిరూపించలేకపోతే ఆరోపణలు చేసిన వారే రాజీనామా చేయాలని ఆయన సవాల్ విసిరారు. కాషాయ వస్త్రాలు ధరించి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విందును ఏర్పాటు చేసిన స్థానిక కాంగ్రెస్ నేత రామ్ నిహాల్ నిషాద్ దీనిపై వివరణ ఇచ్చారు. చేపలు పట్టడం, తినడం తమ నిషాద్ సామాజిక వర్గ సంప్రదాయమని, రాజ్యాంగం ప్రకారం ఎవరు ఏమి తినాలో నిర్ణయించే హక్కు ఎవరికీ లేదని ఆయన పేర్కొన్నారు. విందు ప్రాంగణంలో చేపలను వండుతున్న దృశ్యాలు వెలుగులోకి రావడంతో కొందరు స్థానికులు నిరసన తెలిపారు. అయితే, వర్షం కారణంగా అజయ్ రాయ్‌తో సహా పలువురు నేతలు కార్యక్రమం మధ్యలోనే వెనుదిరిగినట్లు సమాచారం.

# శ్రావణమాసం... మూడో శుక్రవారం

మొదటి పేజీ తరువాయి...

మూడో శుక్రవారం నాడు తన నూతన రాజకీయ పార్టీకి సంబంధించిన పేరు, జెండా, విధివిధానాలు మరియు పూర్తి ప్రణాళికను విజయవాడ వేదికగా అధికారికంగా వెల్లడిస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై పోరాడేందుకు, ప్రజల తరఫున గొంతుక వినిపించేందుకు చట్టసభల్లో ప్రత్యేకంగా ప్రతిపక్ష హోదా ఏమీ అవసరం లేదని విజయసాయి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ మాత్రమే ఏకైక ప్రతిపక్షంగా ఉందని పేర్కొన్నారు. సాధారణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వారి సమస్యలను నేరుగా సభల వరకు తీసుకెళ్లేందుకు ఒక బలమైన స్వతంత్ర రాజకీయ వేదికను ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

# జంతర్ మంతర్ ప్రొటెస్ట్

మొదటి పేజీ తరువాయి...

ఇప్పటికే దాఖలైన ఓ రిట్ పిటిషన్‌లో ఈ విషయాలు అన్నీ ఉన్నాయని తెలిపింది. వెంటనే స్పందించిన సీనియర్ న్యాయవాది శోభా గుప్తా, మహిళలపై జరిగిన లైంగిక వేధింపులను ప్రత్యేకంగా చూడాలని కోరారు. ఇందుకోసం ఒక జిల్లా జడ్జిని లేదా ప్రత్యేక అధికారిని నియమిస్తే, బాధితులు నేరుగా ఫిర్యాదులు చేయడానికి వీలవుతుందని అన్నారు. ఆమె వాదనలు విన్న సీజేఐ, తాము ఇచ్చిన ఉత్తర్వుల్లో ఈ విషయాన్ని స్పష్టంగా రాశామని చెప్పారు. లైంగిక వేధింపుల గురించి మహిళా నిరసనకారులు ఇచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తాము ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఆదేశించామన్నారు. అలాగే ఒక మధ్యంతర నివేదిక కూడా ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా, బాధితుల ఫిర్యాదులు కమిటీ వరకు చేరడంలో ఇబ్బందులు లేదా ఆటంకాలు ఏర్పడవచ్చని శోభా గుప్తా ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఒక ప్రత్యేక ఈ-మెయిల్ ఐడీ ఇచ్చి, ఒక అధికారిని కేటాయించి, దీనికి బాగా ప్రాచుర్యం కల్పించాలని ఆమె కోరారు. ఆమె వాదనలు విన్న చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ 'మీ ఆందోళన సరైనదే'నని అన్నారు. నోడల్ అధికారిని నియమించే అధికారాన్ని కమిటీ ఛైర్మన్‌కు ఇచ్చామని అన్నారు. ఆ నియామకం పూర్తి కాగానే, ఫిర్యాదులు ఎలా చేయాలో అధికారికంగా తెలియజేస్తామన్నారు. అప్పుడు బాధితులు ఎవరైనా సరే నేరుగా ఆ నోడల్ అధికారికి తమ ఫిర్యాదులు అందజేయవచ్చని స్పష్టం చేశారు. గత నెలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) నేతృత్వంలో విద్యార్థులు నిరసనలు చేపట్టారు. అందులో భాగంగా సంసద్ ఛలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ జరిగింది. విద్యార్థులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. బాష్పవాయువు ప్రయోగించారు. ఈ ఘర్షణలో విద్యార్థులతో పాటు పలువురు పోలీసులకు కూడా గాయాలయ్యాయి. ఈ ఘటనపై విచారణ జరిపేందుకు ఆగస్టు 20న సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యులతో ఒక ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డిని ఈ కమిటీకి ఛైర్మన్‌గా నియమించింది. ఈ కమిటీలో పంజాబ్, హరియాణా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రవిశంకర్ ఝా, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శాలిందర్ కౌర్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ మాజీ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, మేఘాలయ రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ ఎల్.ఆర్.బిష్ణోయ్‌లు సభ్యులుగా ఉన్నారు.

# రాజమండ్రి కేసుపై సిబిఐ విచారణకు సోము వీర్రాజు డిమాండ్

**రాజమండ్రి: జయ జయహే: ఆగస్టు24**

తూర్పుగోదావరి జిల్లాలో నమోదైన లవ్ జిహాద్ కేసు అత్యంత ఆందోళనకరమని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. ఈ ఘటనలో భర్తకు ఇంజక్షన్ ఇచ్చి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సాధిక్‌కు అంతర్జాతీయ స్థాయిలో సంబంధాలు ఉన్నాయని, ఢిల్లీలో కొందరు వ్యక్తులు ఆశ్రయం కల్పించారని ఆరోపించారు. బాధిత కుటుంబంపై మత మార్పిడి కోసం ఒత్తిడి తెచ్చారని, ఇది ఒక్క వ్యక్తి పని కాకుండా ఒక ముఠా కుట్రగా అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కేసులో పూర్తి నిజాలు వెలికితీయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని, ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు కూడా లోతుగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. యువతులను వలలో వేసేందుకు షాపింగ్ మాల్స్, జిమ్‌లు వేదికలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై హోంమంత్రి, డిజిపి ఇప్పటివరకు స్పందించకపోవడం విచారకరమన్నారు. డిఎస్సీపై వస్తున్న ఆరోపణలకు అసెంబ్లీలో సమాధానం ఇచ్చామని, కౌన్సిల్ సమావేశాలను వైసిపి ఎమ్మెల్సీలు సక్రమంగా జరగనివ్వలేదని విమర్శించారు. సిబిఐ విచారణ అనేది చిన్న విషయం కాదని, గత ప్రభుత్వ హయాంలో రూ.15 వేల కోట్లతో కొనుగోలు చేసిన భూముల్లో రూ.5 వేల కోట్ల మేర అక్రమాలు జరిగాయని ఆరోపించారు. మద్యం కుంభకోణంపైనా సీబీఐ విచారణ జరగాలా అనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. విశాఖ స్టీల్ ప్లాంట్



నష్టాలకు కమ్యూనిస్టులే కారణమని ఆరోపించిన ఆయన, గోదావరి జిల్లాల్లో కూడా పారిశ్రామిక అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందన్నారు. సిట్ సేకరించిన ఆధారాలపైనే ఈడీ దర్యాప్తు ప్రారంభించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, ఎంఎస్‌కే రాజు, కురగంటి సతీష్, అడబాల రామకృష్ణ, కాలేపు సత్యసాయిరాం, వీర వీరాంజనేయులు, మద్దిపాటి స్వర్ణ రజని, మోహిని, దేవి, స్వామి సూర్యకిరణ్, బండి సత్యప్రసాద్, నందివాడ సత్యనారాయణ, బి.వి. రామారావు, గుర్రాల వెంకట్రావు, తన్నుద్ది భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



## 7 కోట్లతో నిడదవోలుకు పుష్కర శోభ: మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు పట్టణాన్ని పుష్కరాల నాటికి సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.7 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సోమవారం చినకాశీరేవు, బాసివిరెడ్డిపేట ప్రాంతాల్లో పలు పనులకు శంకుస్థాపన చేసి, జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. చినకాశీరేవు నుంచి అన్నపూర్ణనగర్ వరకు రూ.35 లక్షలతో 730 మీటర్ల మెటల్ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డులో రూ.1.34 కోట్లతో సీసీ రోడ్డు, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించారు. గోదావరి పుష్కరాల కోసం 11 ఘాట్ల ఆధునికీకరణ, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, రోడ్లు, విద్యుత్ దీపాలంకరణ తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. రూ.3.69 కోట్లతో అఖండ గోదావరి ప్రాజెక్టు అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా నిడదవోలును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. చినకాశీరేవులో గోదావరి హారతి, శెట్టిపేటలో బోటింగ్, వే-సైడ్ రెస్టారెంట్, ప్లే జోన్, గ్రీనరీ తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. చినకాశీరేవును ఆధ్యాత్మిక కేంద్రంగా, నిడదవోలును ప్రముఖ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. సెప్టెంబర్ 6 నుంచి ఎల్ టి టి ఎక్స్‌ప్రెస్ హాల్ట్ నిడదవోలు రైల్వే జంక్షన్‌లో ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫారాలు తదితర ఆధునిక సదుపాయాలను మంత్రి పరిశీలించారు. సెప్టెంబర్ 6 నుంచి లోక్‌మాన్య తిలక్ టెర్మినస్ (ఎల్ టి టి ) ఎక్స్‌ప్రెస్‌కు నిడదవోలులో హాల్ట్ కల్పించినట్లు తెలిపారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు కూడా నిడదవోలులో హాల్ట్ కల్పించేందుకు రైల్వే శాఖతో చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, మున్సిపల్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## డోర్ టు డోర్ నూరు శాతం పూర్తి చేయండి

**మాడుగుల ఆగస్టు 24 జయ జయహే**



మాడుగుల నియోజకవర్గంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డోర్ టు డోర్ కార్యక్రమం పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే బండర్ సత్యనారాయణమూర్తి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు డోర్ టు డోర్ క్యాంపెయిన్ పైన సమీక్ష నిర్వహించారన్నారు. రాష్ట్రం లో 50% కన్నా తక్కువగా ఉన్న నియోజకవర్గాల పై సమీక్ష నిర్వహించారని, కాబట్టి మాడుగుల నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో వెంటనే డోర్ టు డోర్ క్యాంపెయిన్ ప్రారంభించి 100% పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో మండల కమిటీ గ్రామ కమిటీలు మరింత చొరవ చూపాలన్నారు




## పర్యావరణ విద్య తోనే పర్యావరణ హిత జీవన విధానం సాధ్యం

**- ప్రతి విద్యా సంస్థలో మొక్కలు నాటండి - పి. స్రవంతి**

**రాజమండ్రి (జయ జయహే)**

పర్యావరణ విద్య తోనే పర్యావరణ హిత జీవన విధానం సాధ్యం అని నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఎపి స్టేట్ డైరెక్టర్ పి స్రవంతి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం రాజమండ్రి గ్లోబల్ హై స్కూల్ లో నిర్వహించిన రాష్ట్ర సదస్సు లో ఆమె మాట్లాడారు. విద్యా సంస్థలో నిర్వహించిన ప్రతి పర్యావరణ కార్యక్రమం ప్రకృతి వెబ్ సైట్ లోకి అప్ లోడ్ చేయాలి అని ఆదేశించారు. అలాగే కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత జిపిఎస్ ఫొటోలు, వీడియో అప్లోడ్ చేయాలని కోరారు. అలాగే ప్రతి విద్యా సంస్థలో మొక్కలు విరివిగా నాటాలని కోరారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎన్ జి సి కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ను అగ్రస్థానంలో ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సైనికులు వలె కృషి చేయాలని కోరారు. ఎపి ఎన్ జి సి రాష్ట్ర సమన్వయ కర్త పి నీలకంఠయ్య మాట్లాడుతూ జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చే విధంగా పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు చేత కార్యక్రమాలు ఏ విధంగా నిర్వహించాలి అనేది వివరించారు. విజయనగరం జిల్లా సమన్వయకర్త బి వేణుగోపాల్ రావు పవర్ పోయంట్ ప్రెజెంటేషన్ ద్వారా కార్యక్రమాల నిర్వహణ, నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించి నివేదికల సమర్పణ, అకౌంట్స్ నిర్వహించడం గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం విత్తనాల రాఖీ లను తయారు చేయడం, వృక్షాబంధన్ కార్యక్రమాల గురించి శిక్షణ ఇవ్వడం జరిగిందిమండపేట డ్రాయింగ్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ ఎం సత్యానందం, విద్యార్థులు చిత్రలేఖనాలు ప్రదర్శన నిర్వహించారు. వ్యర్థాల నుండి ఆదాయం సంపాదించడం గురించి గుడ్డ, పేపర్ సంచుల ప్రదర్శన కృష్ణా జిల్లా సమన్వయకర్త కృష్ణ వేణి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లారెల్ గ్లోబల్ హైస్కూల్ యాజమాన్యం నుంచి సుంకరి రవికుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






## మహిళల భద్రతలో ప్రభుత్వం పూర్తిగా విఫలం

**జక్కంపూడి విజయలక్ష్మి**

**రాజమహేంద్రవరం, జయ జయహే :ఆగస్టు 24**

:రాష్ట్రంలో మహిళలు, యువతులకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆరోపించారు. సోమవారం రాజమహేంద్రవరంలోని ప్రకాష్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, హత్యలు,అత్యాచారాలు పెరిగాయని, మహిళలు భయపడే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. మహిళల రక్షణ కోసం తీసుకొచ్చిన దిశ చట్టాన్ని నిర్వీర్యం చేశారని, రాజమహేంద్రవరం మెడికో విద్యార్థిని ప్రియాంక మృతి, ఏఈ నూకరాజు కుటుంబ ఆత్మహత్య వంటి ఘటనలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు కోనేటి ఆదిమూలం, కోన రవికుమార్, అరవ శ్రీధర్, మంత్రి సంధ్యారాణి పీఏ, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు సంబంధించిన ఆరోపణలపై ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మద్యం, గంజాయి విచ్చలవిడిగా సాగుతున్నాయని, బెల్ట్‌షాపులు పెరిగిపోయాయని, ఎన్నికల్లో మహిళలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. మహిళల రక్షణ కోసం వైఎస్సార్‌సిపి తరఫున ఉద్యమాలు చేపడతామని, మహిళలు తిరగబడితే ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాజానగరం మహిళా విభాగం అధ్యక్షురాలు సిహెచ్. ఉమామహేశ్వరి, మాజీ కార్పొరేటర్ పోలు విజయలక్ష్మి కూడా మహిళలపై పెరుగుతున్న దాడులను ఖండించారు. ఈ సమావేశంలో కొండేపూడి లక్ష్మి శిరీష, సంకిస భవానీ ప్రియా, దేవులపల్లి సరిత రాణి, పసుపులేటి దుర్గాదేవి, నిడుబోలు ధనలక్ష్మి, ఎం. శైలజ తదితరులు పాల్గొన్నారు.

## కోట్లవిలువైన భూమిని ఏపీఐఐసికి అప్పగించకండి

**భీశెట్టి బాబ్జి**

**తాడేపల్లి ఆగస్టు 24: (జయ జయహే)**



ఉత్తరాంధ్ర లోని మూతపడ్డ సహకార చక్కెర ఫ్యాక్టరీల అత్యంత విలువైన భూములను ఏపీఐఐసి కి అప్పచెప్పి ఆ భూములను అమ్మేసి రైతులకు, కార్మికులకు బకాయిలు తీర్చే పనిని ఏపీ ఐఐసి కి అప్పగించవద్దని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి రాష్ట్ర సుగర్ కేన్ కమిషనర్ వి. వెంకటరావు ని కోరారు సోమవారం తాడేపల్లి లోని కమిషనర్ ని కలిసి వినతి పత్రం అందచేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మూత పడ్డ తాండవ, ఏటి కొప్పాక, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీలపై క్యాబినెట్ లో తీసుకున్న నిర్ణయం ప్రకటించి జీఓఎమ్(గ్రూప్ అఫ్ మినిస్టర్స్)ని కూడా ఏర్పాటు చేసిందని తాండవ సుగర్ ఫ్యాక్టరీకి 39 ఎకరాలు, ఏటి కొప్పాక కి 72 ఎకరాలు, భీమసింగి కి 73 ఎకరాల భూమి ఉందని మూడు ఫ్యాక్టరీలకి కలిపి సుమారు 50 కోట్ల విలువైన పాడుబడ్డ యంత్ర సామాగ్రి ఉందని రాష్ట్ర ప్రభుత్వమే దాదాపు 300 కోట్ల రూపాయలు పెట్టుబడి పెడితే 2,500 కోట్ల రూపాయల విలువ గల ఆస్థి రాష్ట్ర ప్రభుత్వం కి ఉంటుందని ఇందులో ప్రభుత్వరంగ పరిశ్రమలు పెట్టి యువత కి ఉపాధి చూపించ వచ్చని భీశెట్టి అభిప్రాయపడ్డారు ఏపీ ఐఐసి భూములు అమ్మకాలు ప్రారంభిస్తే కొనుగోలు దారులు సిండికెట్ అయ్యి తక్కువ రేటుకే విలువైన భూములు కొట్టేసే పరిస్థితి ఉందని ప్రజల్లో ఇదే అభిప్రాయం బలంగా ఉందని ఉత్తరాంధ్ర లో సహకార సుగర్ ఫ్యాక్టరీలు ఏర్పాటుకు పాత తరం నేతలు త్యాగాలు చేసారని వారి త్యాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నీరు గార్చే ప్రయత్నం చెయ్యవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు అలోచించి పీపిపి పద్ధతుల్లో ఉత్తరాంధ్ర కి సంబంధించి ఒక ఫ్యాక్టరీ నయినా తెరిపించే ప్రయత్నం చెయ్యాలని భీశెట్టి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.



## మునగపాక వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణానికి విరాళం

**మునగపాక, ఆగస్టు 24, జయ జయహే:**

మునగపాక మండల కేంద్రం మునగపాకలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణానికి ఆడారి కృష్ణమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నూక సోమినాయుడు, నాగలక్ష్మి దంపతులు 11116రూపాయలు విరాళంగా అందజేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెలగ శ్రీను, టెక్కలి కొండలరావు, ఆడారి కాశి బాబు, పెంటకోట వెంకటి, ఆడారి గణేష్, దాడి ముసలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనం

**40 సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత**

**రాజమహేంద్రవరం: జయ జయహే : ఆగస్టు 24:**



ధవళేశ్వరం లో ప్రజలు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించి యజమానులకు తిరిగి అందజేయడంలో ధవళేశ్వరం పోలీసులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదులను కేంద్ర ప్రభుత్వ (సెంట్రల్ ఈక్వయిప్మెంట్ ఐడెంటిటి రిజిస్టర్ ) పోర్టల్‌లో నమోదు చేసి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సుమారు రూ.4.86 లక్షల విలువైన 40 సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. ఈ సందర్భంగా సౌత్ జోన్ డీఎస్పీ శివప్రియ సోమవారం సాయంత్రంధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రికవరీ చేసిన సెల్‌ఫోన్లను సంబంధిత ఫిర్యాదుదారులకు స్వయంగా అందజేశారు. పోయిన వస్తువు తిరిగి దక్కడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ శివప్రియ మాట్లాడుతూ, సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా కూడా వివరాలు నమోదు చేస్తే, వాటిని గుర్తించి తిరిగి అప్పగించే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల కూడా జాగ్రత్తలు తీసుకోవాలని



సూచించారు. ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఇప్పటివరకు 500 సెల్‌ఫోన్ ఫిర్యాదులు నమోదు కాగా, 230 ఫోన్లు ట్రేస్ చేసి, వాటిలో 130 ఫోన్లనువిజయవంతంగా రికవరీ చేశారు. ఈ విడతలో 40 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ విజయవంతమైన రికవరీలో విశేష కృషి చేసిన ధవళేశ్వరం సిఐ గణేష్, ఎస్సై హరిబాబు, ఎస్సై విజయ్ కుమార్ పోలీసు సిబ్బందిని డిఎస్పీ శివప్రియ ప్రత్యేకంగా అభినందించారు.



## స్టేషన్ పరిశుభ్రతే ప్రయాణికుల ఆరోగ్యానికి భరోసా

(ప్రతాప్)

భారతీయ రైల్వే దేశ రవాణా వ్యవస్థకు వెన్నెముక. ప్రతిరోజూ కోట్లాది మంది ప్రయాణికులు రైళ్లను ఆశ్రయిస్తున్న నేపథ్యంలో రైల్వే స్టేషన్ కేవలం రైలు ఎక్కే, దిగే ప్రదేశంగా కాకుండా ప్రజారోగ్యానికి సంబంధించిన కీలక మౌలిక వసతిగా చూడాలి. తాజాగా కాగ్ పరిశీలనల్లో కొన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునే సౌకర్యాలు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక వసతుల నిర్వహణలో లోపాలు బయటపడటం ఆందోళన కలిగిస్తోంది.

దేశవ్యాప్తంగా వేలాది రైల్వే స్టేషన్లలో నిత్యం భారీ సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత పెద్ద జనసంచారం ఉన్న ప్రదేశాల్లో పరిశుభ్రతను కేవలం అందం కోసం కాకుండా ప్రజారోగ్య రక్షణగా చూడాలి. ముఖ్యంగా తాగునీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీకి తావుండకూడదు. నీటి వనరులను నిర్ణీత వ్యవధుల్లో పరీక్షించడం, శుద్ధీకరణ ప్రక్రియను పర్యవేక్షించడం, ఫలితాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం అవసరం.

మరుగుదొడ్ల విషయంలోనూ నిర్మాణం కంటే నిర్వహణ ముఖ్యం. తగిన సంఖ్యలో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ అవి పరిశుభ్రంగా లేకపోతే ప్రయోజనం ఉండదు. మహిళలు, వృద్ధులు, పిల్లలు, దివ్యాంగుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి. ప్లాట్‌ఫారాలపై తగినంత సీటింగ్, తాగునీటి కేంద్రాలు, చెత్తబుట్టలు కూడా అందుబాటులో ఉండాలి.

పారిశుద్ధ్య నిర్వహణను కాంట్రాక్టర్లకు అప్పగించడం మాత్రమే పరిష్కారం కాదు. పని జరిగిందా అన్నదానికంటే, నిర్ణయించిన ప్రమాణాలకు అనుగుణంగా జరిగిందా అన్నదే ముఖ్యం. ప్రతి స్టేషన్‌లో రోజువారీ తనిఖీలు, డిజిటల్ పర్యవేక్షణ, ప్రయాణికుల ఫిర్యాదులకు తక్షణ పరిష్కార వ్యవస్థ ఉండాలి.

రైల్వే స్టేషన్ల ఆధునీకరణలో భవనాల అందం, ఎస్కలేటర్లు, లిఫ్టులు ఎంత ముఖ్యమో తాగునీరు, మరుగుదొడ్లు, సీటింగ్, పారిశుద్ధ్యానికి కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. ఆధునిక స్టేషన్ అంటే కేవలం ఆకర్షణీయమైన భవనం కాదు--- పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, గౌరవప్రదమైన ప్రయాణ అనుభవాన్ని అందించే ప్రజా వేదిక.

రైల్వే అభివృద్ధి తదుపరి దశలో వేగం, సౌకర్యంతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రత, మానవ గౌరవం కూడా ప్రధాన ప్రమాణాలుగా మారాలి.

# పాలిటెక్నిక్ విద్యలో మార్పులు

## విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా తప్పనిసరి

(హెచ్.ప్రతాప్)

**తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలన్న ప్రతిపాదనపై విద్యార్థులు, అధ్యాపకుల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గో నెం.97 నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు జరగడం, ఈ మార్పు విద్యార్థుల భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న సందేహాలు బలంగా ఉన్నాయని సూచిస్తోంది. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా, సాంకేతిక విద్య నాణ్యత, విద్యార్థుల ఉన్నత విద్య, ఉపాధి అవకాశాల పరిరక్షణ దృష్టితో చూడాలి.**



పాలిటెక్నిక్ విద్యకు తెలంగాణలో సుదీర్ఘ చరిత్ర ఉంది. ప్రతి ఏడాది దాదాపు 50 వేల మంది విద్యార్థులు పాలిటెక్నిక్‌లలో చేరుతున్నారని అందుబాటులో ఉన్న వివరాలు చెబుతున్నాయి. డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులకు పరిశ్రమల్లో ఉద్యోగాలతో పాటు ఈసెట్ ద్వారా ఇంజినీరింగ్ డిగ్రీలో లేటరల్ ఎంట్రీ పొందే అవకాశం కూడా కీలకంగా ఉంది. ఈసెట్ కొనసాగుతుందా? ఉన్నత విద్యకు ప్రస్తుత మార్గాలు మారతాయా? అన్నదే విద్యార్థుల ప్రధాన ఆందోళనల్లో ఒకటి.




అదే విధంగా పాలిటెక్నిక్‌లను ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లతో ఒకే వ్యవస్థలోకి తీసుకురావడం వల్ల పాలిటెక్నిక్ విద్య ప్రత్యేకత దెబ్బతింటుందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పాలిటెక్నిక్‌లలో థియరీ, ప్రాక్టికల్ విద్యకు ప్రత్యేకమైన సమతుల్యత ఉండగా, ఐటీఐల శిక్షణ విధానం భిన్నంగా ఉంటుంది. కాబట్టి రెండు వ్యవస్థల ప్రత్యేకతలను ఎలా కాపాడతారనే దానిపై స్పష్టత అవసరం.

ఫీజులు పెరుగుతాయన్న భయం కూడా విద్యార్థుల్లో ఉంది. యూనివర్సిటీ పరిధిలోకి వచ్చిన తర్వాత ఫీజుల నిర్ణయం ఎలా ఉంటుంది, ప్రస్తుత రాయితీలు కొనసాగుతాయా అన్న విషయాలపై ముందుగానే స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలి. పాలిటెక్నిక్ విద్య సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేలా ఫీజులపై తగిన నియంత్రణ ఉండాలి.

అధ్యాపకులు, సిబ్బంది విషయంలోనూ కేడర్, వేతనాలు, పదోన్నతులు, ఉద్యోగ భద్రతపై సందేహాలు ఉన్నాయి. పాలిటెక్నిక్‌లు ఏఐసీటీఈ ప్రమాణాలను అనుసరిస్తున్నందున, సిబ్బంది సేవా నిబంధనలు, అర్హతలు, వేతనాలు, ప్రమోషన్ అవకాశాలకు ఎలాంటి మార్పు ఉండదనే స్పష్టమైన హామీ అవసరం.

అయితే ప్రతిపాదిత మార్పు వెనుక ఉన్న సానుకూల ఉద్దేశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో కోర్సులను అనుసంధానించడం, ఆటోమేషన్, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక తయారీ వంటి రంగాల్లో శిక్షణ పెంచడం వల్ల విద్యార్థుల ఉపాధి సామర్థ్యం మెరుగుపడవచ్చు.

అందుకే ముందుగా విద్యార్థుల హామీ పత్రం ప్రకటించడం సముచితం. అందులో ఈసెట్ లేదా సమానమైన లేటరల్ ఎంట్రీ మార్గం, ఫీజుల పరిరక్షణ, ప్రస్తుత విద్యా హక్కులు, సిబ్బంది సేవా భద్రత, ఏఐసీటీఈ ప్రమాణాలు కొనసాగింపుపై స్పష్టత ఉండాలి. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమ ప్రతినిధులతో సంప్రదింపుల కమిటీ ఏర్పాటు చేసి, మార్పులను దశలవారీగా అమలు చేయాలి.

పాలిటెక్నిక్ వ్యవస్థను మార్చడం లక్ష్యం కాకూడదు; దాన్ని ఆధునికీకరించి మరింత బలమైన ఉపాధి వేదికగా మార్చడమే లక్ష్యం కావాలి. విద్యార్థుల సందేహాలకు స్పష్టమైన సమాధానాలు ఇచ్చి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించినప్పుడే సంస్కరణకు విస్తృత ఆమోదం లభిస్తుంది.

# అమరావతి కేవలం రాజధాని కాదు..

## ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ఇంజిన్‌గా ఎదగాలి

రచయిత సీ.హెచ్. ప్రతాప్

**రాజధాని అంటే ప్రభుత్వ కార్యాలయాల సముదాయం మాత్రమే కాదు. ఒక రాష్ట్ర ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే కేంద్రం. ఈ దృష్టితో చూస్తే అమరావతికి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అత్యంత కీలకమైన పాత్ర ఉంది. రాజధానిగా నిర్మాణం సాగుతూనే, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి చోదకశక్తిగా కూడా అమరావతి ఎదగాల్సిన అవసరం ఉంది.**



అమరావతికి ఉన్న భౌగోళిక అనుకూలత ఈ అవకాశాన్ని మరింత బలపరుస్తోంది. కృష్ణా నదీ పరివాహక ప్రాంతం, విజయవాడ--గుంటూరు నగరాల సమీపం, రవాణా అనుసంధాన అవకాశాలు, ఇప్పటికే అభివృద్ధి చెందిన విద్యా సంస్థలు, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ---ఇవన్నీ కలిస్తే అమరావతి చుట్టూ ఒక శక్తివంతమైన ఆర్థిక ప్రాంతాన్ని నిర్మించవచ్చు.

ప్రభుత్వ కార్యాలయాలు, శాసనసభ, న్యాయ వ్యవస్థ వంటి సంస్థలు రాజధాని పరిపాలనా ప్రాధాన్యాన్ని పెంచుతాయి. కానీ ఆర్థిక ఇంజిన్‌గా మారాలంటే అంతకుమించి ఆలోచించాలి. సమాచార సాంకేతిక రంగం, ఆర్థిక సేవలు, పరిశోధన, ఉన్నత విద్య, వైద్య సేవలు, స్టార్టప్‌లు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు వంటి రంగాలను ప్రోత్సహించాలి. స్థానిక యువతకు ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు కల్పించే వాతావరణం ఏర్పడాలి.

అమరావతి అభివృద్ధి విజయాన్ని కేవలం ఎన్ని భవనాలు నిర్మించామన్న దానితో కొలవకూడదు. ఎన్ని కొత్త సంస్థలు వచ్చాయి? ఎన్ని ఉద్యోగాలు ఏర్పడ్డాయి? స్థానిక వ్యాపారాలకు ఎంత ప్రోత్సాహం లభించింది? ప్రజలకు రవాణా, నీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, విద్య వంటి సౌకర్యాలు ఎంత మెరుగయ్యాయి? అనే ప్రశ్నలకు సమాధానాలు ముఖ్యమైనవి.

అదే సమయంలో అమరావతి అభివృద్ధి పర్యావరణహితంగా ఉండాలి. వరద ముప్పును దృష్టిలో పెట్టుకుని సమర్థవంతమైన నీటి పారుదల వ్యవస్థ, విస్తృతమైన పచ్చదనం, ప్రజా రవాణా, నడకకు అనుకూలమైన మార్గాలు, సరసమైన గృహ నిర్మాణం వంటి అంశాలను మొదటి నుంచే ప్రణాళికలో భాగం చేయాలి. భవిష్యత్తు తరాలకు భారంగా కాకుండా, వారికి అవకాశాలను అందించే నగరంగా అమరావతి రూపుదిద్దుకోవాలి.

విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తెనాలి తదితర ప్రాంతాలను సమన్వయంతో అభివృద్ధి చేస్తే అమరావతి ఒక నగరంగా మాత్రమే కాకుండా ఆర్థిక కార్యకలాపాల విస్తృత కేంద్రంగా మారగలదు. అప్పుడు రాజధాని అభివృద్ధి ప్రయోజనాలు ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే అవకాశం ఉంటుంది.

అమరావతి నిర్మాణం ఒక భౌతిక ప్రాజెక్టు కాదు.. ఇది ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మలిచే అవకాశం. దూరదృష్టితో ప్రణాళిక, పారదర్శక అమలు, ప్రజల భాగస్వామ్యం, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉంటే అమరావతి పరిపాలనా రాజధానిని దాటి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతికి శక్తివంతమైన చోదకశక్తిగా ఎదగాలి.

## మొక్కలు నాటిన కల్లం హరినాథ్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు



గుంటూరు (జయ జయహే)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గుంటూరు జిల్లా గ్రీనరీ 7 శాతంతో అట్టడుగున ఉన్న పరిస్థితుల్లో గుంటూరు నగరంలో రైల్వే ఎకోపార్క్ లో నగరంలోని పౌర సంస్థలు 1500 మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించాయని చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపకులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. ఈనెల 24వ తేదీన గుంటూరులోని రైల్వే ఎకోపార్క్ లో కల్లం హరినాథ్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కి చెందిన ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు కొత్తగా 100 మొక్కలు నాటడం మరొక 200 మొక్కలను సంరక్షిస్తూ పచ్చదనం పెంపుదలకు కృషి చేశారు. కల్లం హరినాథ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సెక్రటరి డా॥ యం. ఉమా శంకర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా॥ బి.ఎస్.బి. రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొఫెసర్ డి. శ్రీనివాసులు నేతృత్వంలో 60 మంది విద్యార్థినీ,విద్యార్థులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మొక్కలు నాటి సంరక్షణను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపకులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ పర్యావరణ సమతుల్యత మరియు పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. నేటితరం విద్యార్థుల్లో పర్యావరణం పట్ల బాధ్యతను పెంచడమే ఈ కార్యక్రమం లక్ష్యం అన్నారు. భూతాపాన్ని తగ్గించడంలో చెట్లు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. వృక్షాలు జీవవైవిధ్య పరిరక్షణకు తోడ్పడుతాయని మనం చెట్లను కాపాడితే ఆ చెట్లు మనల్ని కాపాడుతాయని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భూమిలో 31 శాతం గ్రీనరీతో ఉందని దాదాపు 3 లక్షల కోట్ల చెట్లు ప్రపంచంలో ఉన్నాయని రష్యా, బ్రెజిల్, కెనడా, అమెరికా, చైనా దేశాలలో గ్రీనరీ అత్యధికంగా ఉందని విద్యార్థులకు వివరించారు. భారత అటవీ సర్వే నివేదిక ప్రకారం భారతదేశంలో 20 శాతం గ్రీనరీ ఉండగా ఆంధ్రప్రదేశ్ లో 18 శాతం లోపుగా ఉందని, గుంటూరు జిల్లాలో 7 శాతం మాత్రమే ఉండడం దురదృష్టకరమన్నారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ తోడ్పాటుతో మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే డివిజన్ అధికారులు ఎస్. మంజునాథ్, రామ శేష రెడ్డి, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# మహిళల భద్రత స్వీయ రక్షణకు శక్తి యాప్ మేలు

### ఐతం కళాశాలలో శక్తి టీమ్ అవగాహన సదస్సు

**టెక్కలి ఆగస్టు 24 జయ జయహే**

మహిళల బాల బాలికలకు విద్యార్థుల మనో ధైర్యానికి శక్తి యాప్ ఎంతగానో మేలు చేస్తుందని టెక్కలి సబ్ డివిజన్ పోలీస్ శాఖా శక్తి బృందం ప్రతినిధులు స్థానిక ఐతం ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సమగ్ర భద్రత చట్టాలపై శక్తి టీం సభ్యులు నరసింహమూర్తి, ప్రభావతి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో సహాయం కోసం ఎదురు చూస్తున్న ఎవరైనా తగిన సమాచారం పోలీస్ లకు అందించేందుకు హెల్ప్ లైన్ నెంబర్లను 112,181,1091 తమ భద్రత కోసం తక్షణమే వీటిని ఉపయోగించాలని అన్నారు. గృహ హింస బాల్య వివాహాలు, చట్టాలు, సైబర్ మోసాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, రహదారి భద్రత , అత్యవసరం సహాయం కోసం 1033 కు తగిన సమాచారం అందించి ఆపదల నుంచి బయటపడాలని శక్తి టీం సభ్యులు



తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు డీన్ డాక్టర్ ఆర్ శాంతి కుమార్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మారుతి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేవళ్లు పంచాయతీలో పీజీఆర్ఎస్

### 25 ఫిర్యాదులు..

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 25,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలోని రేవళ్లు పంచాయతీలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు 25 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ జిడివి ప్రసాద్ తెలిపారు. ఇందులో రెవెన్యూ - 19, సివిల్ సప్లై గ్యాస్ - 2, హెల్త్ - 1, ఎడ్యుకేషన్ - 1, పిఆర్ ఌ డీఓ - 1, మత్స్య, పరిశ్రమ - 1,చొప్పున మొత్తం 25 ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాదరావు, పిఆర్ జెఈ సిహెచ్ రామకృష్ణ, ఆర్డబ్ల్యూఎస్ జేఈ, పలువురు అధికారులు పాల్గొన్నారు.



## వీఎంఆర్డీఏ ప్రజాదర్భార్‌కు 11 వినతులు

**విశాఖపట్నం (జయ జయహే)**

వీఎంఆర్డీఏ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు 11 వినతులు వచ్చాయి. వీఎంఆర్డీఏ సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొని అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీదారులతో ఆయన స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయా అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి, సత్వరమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన వినతల పరిష్కారం చూపటంలో అలసత్వం వహించవద్దని సూచించారు. అర్జీదారులకు శాఖాపరంగా తీసుకున్న చర్యలను గడువులోగా సమాచారం అందించాలని సూచించారు. ప్రజాదర్బార్‌కు మొత్తం 11 వినతులు రాగా, వాటిలో ప్లానింగ్ విభాగానికి 8 వినతులు, పరిపాలన విభాగానికి 1,ఎస్టేటు విభాగానికి 2 చొప్పున వినతులు వచ్చాయి. కార్యక్రమంలో ఈవో దయానిధి, అదనపు కార్యదర్శి రుషిబాబు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## స్థానిక ఎన్నికలకు జనసైనికులు సిద్ధం కావాలి

### డా.రవి కుమార్ మిడతాన

**విజయనగరం (జయ జయహే) .**

ప్రజల పక్షాన పోరాటమే జనసేన సిద్ధాంతమని స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిసి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ , జనసేన జిల్లా సీనియర్ నాయకులు డా రవికుమార్ మిడతాన జనసేన పిలుపునిచ్చారు.జనసేన పార్టీకి జనసైనికులు వీర మహిళలే అసలైన బలమని, వారి అంకిత భావంతోనే పార్టీ బలోపేతం అవుతుంది అన్నారు,కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలుతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో సమన్వయంతో పని చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. జన సైనికుల అభిమతం కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగానే జనసేన పార్టీ ముందుకు సాగుతుందని చెప్పారు. అధికారంలో ఉన్న లేకున్నా ప్రజల సమస్యలపై పోరాడే తత్వం జనసేన పార్టీ ప్రత్యేకత అని అన్నారు.ప్రజల కోసం నిబద్ధతతో పనిచేయడం, క్రమశిక్షణతో వ్యవహరించడం, పోరాట స్ఫూర్తిని కలిగి ఉండడం వంటి విలువలను పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మొదటి నుంచే జనసైనికులు వీర మహిళలకు నేర్పారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు వీర మహిళల సంక్షేమం కోసం ప్రత్యేక వ్యవస్థను రానున్న రోజుల్లో ఏర్పాటు చేయనున్నట్లు పవన్ కళ్యాణ్ సంకల్పించారని, ఆయన వెల్లడించారు.. జనసేనలో కష్టపడి పని చేసే కార్యకర్తలకి ఎప్పటికీ ప్రాధాన్యం, గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు.జనసేన సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలను, ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎన్డీఏ కూటమి పట్ల అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు.. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రాము నాయడు,దేముడు,కాలి దాసు,రాంబాబు, ప్రసాద్, పైడిరాజు,దేముడు నాయుడు, సూర్య తేజ, శంకర్ రావు, బదరీనాథ,తరుణ్ కుమార్, శివ నాయకులు పాల్గొన్నారు..



## భోజన వితరణ చేసిన కలెక్టర్ విజయకృష్ణన్

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి మండలం శంకరం గ్రామం సమీపలగల జిల్లా కలెక్టర్ కార్యాలయం కి సుధీర ప్రాంతాల నుంచి వచ్చే ఆర్జీ దారులకు, నిరుపేదలకు అక్కడ ఆ ప్రాంతంలో సరైన భోజనం హోటల్ అందుబాటులో లేకపోవడం తో కలెక్టర్ ఆఫీస్ కి వచ్చే ఆర్జీదారులు ఇబ్బందులు పడుతూ ఉండడంతో, వారికి కలెక్టర్ కార్యాలయ సిబ్బంది జిల్లా కలెక్టర్ సహకారంతో సోమవారం అన్న వితరణ చేయడం జరిగింది ఈ అన్న వితరణలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ జాయింట్ కలెక్టర్,సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది



## ఎమ్మెల్యే రామకృష్ణ కలిసిన ఆర్టీసీ డిఎం రాజేశ్వరి

**అనకాపల్లి జయ జయహే**

ఏపీఎస్ ఆర్టీసీ బదిలీలలో భాగంగా అనకాపల్లి ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏ రాజేశ్వరి సోమవారం స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది ఈ సందర్భంగా ఆమెకు ఎమ్మెల్యే రామకృష్ణ అభినందనలు తెలియజేశారు అనకాపల్లి డిపో పరిధిలో ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు అవసరాలకు అనుగుణంగా బస్ సర్వీస్ లు నిర్వహించ డం ప్రయాణికుల సమస్యల సత్వరమే పరిష్కరించడం ఈ జిల్లా డిపో అభివృద్ధికి కృషి చేయాలని ఆయన ఆమెకు సూచించారు అనకాపల్లి ప్రాంత ప్రజలకు నాణ్యమైన మెరుగైన సౌకర్య సేవలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని డిపో మేనేజర్ ఏ రాజేశ్వరి పేర్కొన్నారు



## నైపుణ్యంతోనే స్వాలంబన సాధ్యం

### శాసనసభ్యులు గొండు.శంకర్

**శ్రీకాకుళం. - ( జయ జయహే)**

నైపుణ్యంతోనే స్వాలంబన సాధ్యమని, నియోజకవర్గ శాసనసభ్యులు గొండు.శంకర్ అన్నారు. స్థానిక విద్యాధరి డిగ్రీ కళాశాలలో, పిఎం విశ్వకర్మ యోజనలో భాగంగా ఐసిఏ ఈడియూ స్కిల్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గొండు.శంకర్ ముఖ్య అతిధిగా పాల్గొని, శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్రత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిశ్రమల కేంద్రం, ప్రభుత్వ సబ్సిడీలు, బ్యాంకు రుణాలు, ఆర్థిక ప్రోత్సాహక కార్యక్రమాలను పొందేందుకు వీలు కల్పిస్తుందని, తద్వారా జీవనోపాధికి ఒక వేదికగా నిలుస్తుందన్నారు. మన దేశంలో తరతరాలుగా తమ చేతివృత్తులను, సంప్రదాయ వృత్తులను ఆధారంగా చేసుకుని జీవిస్తున్న కళాకారులు, చేతివృత్తిదారులను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజన ప్రారంభించిందన్నారు. ఈ పథకం ద్వారా మన సంప్రదాయ వృత్తులకు గౌరవం, నైపుణ్యాభివృద్ధికి శిక్షణ, ఆధునిక పనిముట్లకు సహాయం, ఆర్థికంగా ఎదగడానికి అవసరమైన అవకాశాలు కల్పించడం జరుగుతోందని, ఈ శిక్షణ ద్వారా అభ్యర్థులు తమ వృత్తిలో మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకొని, స్వయం ఉపాధి, ఆర్థిక అభివృద్ధి సాధించేలా ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. శిక్షకులు ఐసీఏ పిఎంకెకె శ్రీకాకుళం మేనేజర్ వై.పార్థసారథి, ఇంచార్జి సాహిత్య పర్యవేక్షణలో శిక్షణ పూర్తిచేసుకోవటం హర్షణీయమని ఈ సందర్భంగా తెలిపారు. విశిష్ట అతిథి జిల్లా బీజేపీ అధ్యక్షులు, సిరిపురపు.తేజేశ్వర్ రావు, గౌరవ అతిథులుగా విద్యావేత్త, చైతన్య సహకార జూనియర్, విద్యాధరి డిగ్రీ కళాశాలల అధినేత డా.జామి.బీమశంకర్, జిల్లా టీడీపీ నాయకులు ఎస్వీ. రమణ మాదిగ, నగర టీడీపీ అధ్యక్షులు పాండ్రంకి శంకర్, విద్యాధరి డిగ్రీ కళాశాల మేనేజిమెంట్ సభ్యులు విటి.నాయుడు, పి.భాగ్యలక్ష్మి, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షురాలు తమ్మినేని.ఉషరాణి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శిక్షణా సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చాకిపల్లిలో రగ్బీ టోర్నమెంట్

### అస్మిత ఖేల్ ఇండియా ఉమెన్స్ పోటీలు

**టెక్కలి ఆగస్టు 24 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అస్మిత ఖేల్ ఇండియా అండర్ 18 ఉమెన్స్ రగ్బీ టోర్నమెంట్ పోటీలు ఘనంగా జరిగాయి. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రగ్బీ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ సారథ్యంలో క్రీడలు నిర్వహించారు, ఇందులో జిల్లా నుంచి 13 బృందాలు పాల్గొన్నాయి, రగ్బీ టోర్నమెంట్ పోటీలు ల్లో విన్నరు గా సిక్కోలు టీమ్, రన్నర్ గా కేజి బీవీ సంతబొమ్మాలి, తృతీయంగా కేజి బీవీ జలుమూరు టీమ్లు విజేతలుగా గెలుపొందాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే నారాయణ రావు, మాజీ సర్పంచ్ పంగ త విటయ్య, విద్యా కమిటీ చైర్మన్ సునీత, రోణంకి శ్రీనివాస్, రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డొంకాన రామకృష్ణ, పార్వతీశం, నారాయణరావు, సుమంత్, జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.



# దళిత పేటలో మౌలిక వసతులు కల్పించాలి

**అనకాపల్లి జయ జయహే**



అనకాపల్లి జిల్లాలోని దళితపేటలో కాలనీలో నెలకొని ఉన్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కుల వ్యవస్థకు అడ్డుకట్ట వేయాలని దళితులకు స్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు నాయకులు సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద విన్నోత రీతిలో మృతదేహంతో కూడిన పా డితో ర్యాలీ నిర్వహించి కలెక్టర్ ఆఫీస్ వద్ద నిరసన తెలియజేశారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సత్యనారాయణ కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈ చిరంజీవి అధ్యక్షతన ఈ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ ధర్నా అనంతరం అక్కడికి వచ్చిన మద్దతుదారులతో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె లోకనాథశీ మాట్లాడుతూ కుల వివక్ష లేని సమాజం కోసం సామాజిక శంఖారావం కార్యక్రమంలో భాగంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లాలోని 20 మండలాల పరిధిలో 71 గ్రామాల్లో దళిత పేట కాలనీలో ప్రత్యక్ష సర్వేల నిర్వహించినట్టు వారు పేర్కొన్నారు అనేక దళిత కాలనీలో కనీస మౌలిక వసతులు లేవని మంచినీటి సమస్య కుళాయి కనెక్షన్లు ఉన్న నీరు రాకపోవడం అద్వానంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం లేకపోవడం వంటి అనేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు జిల్లాలోని అనేక గ్రామాల్లో దళితులకు స్మశానవాటికులకు స్థలాలు లేకపోవడం ఉన్న స్థలాలు కబ్జాలకు గురవడం సామాజిక భవనాలు కూడా లేకపోవడం వంటి సమస్యలు ఇంకా కొన సాగుతున్నాయని ఏళ్ల తరబడి సాగు చేసుకున్న దళిత భూములు పట్టాల ఇవ్వకపోవడం వల్ల వారి భూమి హక్కులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఎస్ రాయవరం మండలం సైతారు పేటలో దళితులకు క్షవరం చేయడానికి నిరాకరించడం వంటి కుల వ్యవస్థ సంఘటనలు జరుగుతుండటం తీవ్ర ఆందోళనకరమని ఎటువంటి ఘటనలపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధ్యతలకు రక్షణ కల్పించాలని వారి డిమాండ్ చేశారు పాయకరావుపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రభుత్వ స్థలంలో సుమారు 40 ఏళ్లుగా ఇల్లు గుడిసెలు పాకలు వేసుకుని నివసిస్తున్న పేద కుటుంబాలను ప్రత్నాయము వసతి కల్పించకుండా జెసిబి లతో తొలగించేందుకు అధికారులు ప్రయత్నించడం దారుణమని అక్కడ నివసిస్తున్న ప్రతి కుటుంబాన్ని గుర్తించి వారి నివాస సమస్యల ముందుగా పరిష్కరించకుండా ఎలాంటి బలవంతపు తొలగింపులు చేపట్టకూడదని వారి డిమాండ్ చేశారు అర్హులైన కుటుంబాలకు ఇల్లపట్టాలు ప్రభుత్వ గృహ పథకం ద్వారా ఇల్లు మంజూరు చేసి వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు నిర్వహించిన సర్వే ద్వారా గుర్తించిన సమస్యల నివేదన జిల్లా కలెక్టర్కు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో సిఐటి రాష్ట్ర కమిటీ సభ్యులు జి కోటేశ్వరావు కే శ్రీనివాస్ సిఐటి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు జిఎంపి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్ సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు సిఐటియు నాయకులు గనిశెట్టి సత్యనారాయణ ఆర్ రాము జి దేముడి నాయుడు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు గండి నాయన బాబు కే గోవిందరావు ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి ఆర్ దేవుడి నాయుడు ఎస్ వి నాయుడు తదితరులు పాల్గొన్నారు


## తెలుగు చలన చిత్ర పరిశ్రమలో చెరగని ముద్ర వేసుకున్న నటి అంజనీ దేవి

### సినీ నటి అంజనీ దేవి శత జయంతి వేడుకలు ప్రారంభం

**భీమవరం ; (జయ జయహే)**

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో అంజలీదేవి తన నటనతో చెరగని ముద్ర వేశారని, సీత పాత్రలో అంజలి నటనకు అప్పట్లో బ్రహ్మరథం పట్టారని పట్టణ కళా పోషకులు గన్నాబత్తుల శ్రీనివాస్ అన్నారు. పట్టణ కళాకారులు సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం వెంకట్రామ థియేటర్ ప్రాంగణంలో సోమవారం సినీ నటి అంజనీ దేవి శత జయంతి ప్రారంభ వేడుకలను నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ అచ్చతెలుగు ఆడబడుచు అంజలీదేవి రంగస్థలంతో తన నట జీవితాన్ని ప్రారంభించి అనేక సూపర్ హిట్ సినిమాల్లో నటించారని, ఒక చిన్న క్యారెక్టర్ తో వెండి తెరపై అడుగు పెట్టిన అంజనీ కుమారి, అంజలీదేవిగా జానపద, పౌరాణిక, సాంఘిక, సినిమాల్లో నడిచి తనదైన ముద్ర వేసుకున్నారని అన్నారు. ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి మల్లుల శ్రీనివాస్, సభ్యులు ఎస్ కే చాన్ భాషా, టివివి ప్రసాద్ మాట్లాడుతూ 1950 - 75 తరానికి చెందిన తెలుగు సినిమా నటీమణి అభినవ సీతమ్మగా అంజలీదేవి పేరొందరన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, చైతన్య భారతీ నాటక పరిషత్ సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ కష్టజీవిలో సినిమాతో హీరోయిన్ గా జర్నీ మొదలు పెట్టి సువర్ణ సుందరి, అనార్కలి, లవకుశ, ఇలా దాదాపు 500 తెలుగు, తమిళ, కన్నడ చిత్రాల్లో అంజలీ దేవి నటించారని అన్నారు. 1969లో భీమవరం మిత్ర సమాజం వార్షికోత్సవానికి భీమవరం వచ్చారని అన్నారు. అప్పట్లో అంజలి ఎక్కడికైనా వెళ్ళితే.. నిజమైన సీతాదేవిగా భావించి మోకరిల్లిన సందర్భాలున్నాయని అన్నారు. కార్యక్రమంలో గంటా సుందర్ కుమార్, పి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.





## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత ఎస్పీ ఎల్ మోహన్ రావు

**అనకాపల్లి జయ జయహే**

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వారికి భరోసా కల్పించడమే లక్ష్యంగా అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదుల ప్రజా వేదిక కార్యక్రమశీ నిర్వహించడం జరిగింది అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశానుసారం జిల్లా అదనపు ఎస్పి ఎల్ మోహన్ రావు బాధితుల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా నలమూల నుండి వచ్చిన వచ్చిన ప్రజల నుండి మొత్తం ఫిర్యాదులు 56 వాటిని స్వీకరించడం జరిగింది . వీటిలో ప్రధానంగా సివిల్ వివాదాలు భూతగాధలు మరియు ఆస్తి సంబంధిత సమస్యలు కుటుంబ సమస్యలు భార్యాభర్తల మధ్య కలహాలు వేధింపులు మోసపూరిత వ్యవహారాలు ఆర్థిక నేరాలు ఇతర ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన అంశాలు పలు ఫిర్యాదులను ఆయన పరిశీలించిన అనంతరం అదనపు ఎస్పి సంబంధిత పలు పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వారికి కీలక సూచనలు ఇవ్వడం జరిగింది . ప్రతి ఫిర్యాదు పై ఏడు రోజుల్లో సమగ్ర విచారణ పూర్తి చేయాలని ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా వాస్తవాలు ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులకు మీరు చేపట్టిన చర్యలు గురించి ఎప్పటికప్పుడు సమాచారం వారికి అందించాలని విచారణ అనంతరం తీసుకున్న చర్యల నివేదికను తప్పనిసరిగా జిల్లా పోలీస్ కార్యాలయానికి సమర్పించాలని వారు తెలియజేశారు ప్రజలకు వేగవంతమైన పారదర్శకమైన న్యాయం అందించడమే పోలీస్ యంత్రాంగం ప్రధాన బాధ్యతని ప్రధాన కర్తవ్యం అని ప్రజా సమస్యల పరిష్కారంలో అనకాపల్లి జిల్లా పోలీసులు ఎప్పుడు ముందు ఉంటారని అదనపు ఎస్పీ ఎల్ మోహన్ రావు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సై బి శ్రీనివాసరావు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు

# శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం

**శ్రీకాళహస్తి,ఆగస్టు24,జయజయహే:**

శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ,స్టెప్స్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సోమవారం హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణపై ఐఈసీ వాహనం ద్వారా విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఎయిడ్స్కు ప్రస్తుతం సరైన మందులు లేవని, నివారణే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్కు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వినియోగం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే స్టెప్స్ ప్రాజెక్ట్ మేనేజర్ భాస్కర్ మాట్లాడుతూ.. ప్రజలకు హెచ్ఐవీకి సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా టోల్ ఫ్రీ హెల్ప్లైన్ నంబర్ '1097' కు కాల్ చేసి నివృత్తి చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో స్టెప్స్ ప్రాజెక్ట్ సిబ్బంది, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో





## రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి సంక్షేమం.. ఇంటింటా తెలుగుదేశం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు బూత్ నెం.40లో "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి సంక్షేమం, ఇంటింటా తెలుగుదేశం" కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు ఆదేశాల మేరకు, నిడదవోలు పట్టణ టీడీపీ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. రెండేళ్ల పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ సెక్రటరీ తిరుపతి సత్యనారాయణ, ముప్పిడి సత్యనారాయణ, బైపే రాజేశ్వరరావు, అంగర శ్యామ్ గౌడ్, ఎండి షాజహాన్, అబ్దుల్ అజీజ్ భాషా, ఎస్కే కరీం, ఘనసాల శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. _



## అంతర్జాతీయ అవార్డు గ్రహీతలకు రోటరీ క్లబ్ నిడదవోలు ఆధ్వర్యంలో ఘన సన్మానం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

రోటరీ క్లబ్ నిడదవోలు ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ అవార్డును దక్కించుకున్న క్లబ్ నాయకులను ఘనంగా సన్మానించారు. రోటరీ క్లబ్ నిడదవోలు పాస్ట్ ప్రెసిడెంట్ మీసాల శివరామహరి ప్రసాద్, పాస్ట్ సెక్రెటరీ దారపురెడ్డి శ్రీరాం ప్రతాప్ అంతర్జాతీయ స్థాయి అవార్డును కైవసం చేసుకోవడంతో వారి సేవలను గుర్తిస్తూ ఈ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో క్లబ్ ప్రెసిడెంట్ మారిశెట్టి అమ్మిరాజు, సెక్రటరీ చిలకల మల్లికార్జునరావు, ట్రెజరర్ చిలకల సుబ్బారాయుడు మాట్లాడారు. రోటరీ క్లబ్ ద్వారా సమాజానికి అందిస్తున్న సేవలకు గానూ ఈ అంతర్జాతీయ గుర్తింపు రావడం నిడదవోలు క్లబ్కే గర్వకారణమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్బు ఫౌండర్ భూపతి ఆదినారాయణ, సీనియర్ రొటీరియన్లు మరియు క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు.



## విశాఖలో ఐయంసిసిఐ గ్లోబల్ ప్లాట్ఫామ్ ప్రారంభం

**విశాఖపట్నం జయ జయహే**

ఇంటర్నేషనల్ మైనారిటీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ గ్లోబల్ బిజినెస్ ప్లాట్ఫామ్ను విశాఖపట్నంలోని ఎంవీపీ కాలనీలో ఉన్న ఐఐఎం బిజినెస్ స్కూల్లో ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి రీడ్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ ఎస్.పీ. రవీంద్ర ముఖ్యఅతిథిగా, రీడ్ గ్రూప్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ వి. కృష్ణమోహన్ గెస్ట్ ఆఫ్ ఆనర్గా, ఎంఆర్డీఏ స్పెషల్ ఆఫీసర్ హుస్సేన్ సాహెబ్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు, ప్రొఫెషనల్స్, వివిధ రంగాల ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి వ్యాపార సంబంధాలను బలోపేతం చేయడం ఐ యం సి సి ఐ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కంపెనీస్ యాక్ట్--2013లోని సెక్షన్--8 కింద ఏర్పాటైన ఐ యం సి సి ఐ దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా వ్యాపార సంస్థలను అనుసంధానించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఐ యంసి సి ఐ నేషనల్ చైర్మన్ కె.ఎం. చిస్టీ (బాబు), వైస్ చైర్మన్లు డా. ఖాజా, డా. ఆనంద్, మీర్ అబ్బాస్ హుస్సేన్, డా. అస్లాం, ఎం.డి. కైజర్, రైస్ అహ్మద్, సీఈఓ మహమ్మద్ షమ్స్ తబ్రేజ్, ఉమెన్ ఎంటర్ప్రెన్యూర్షిప్ డైరెక్టర్ అఫ్రీన్ ఆర్జా, లీగల్ డైరెక్టర్లు షేక్ బాజీ, షేక్ ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంటర్ప్రెన్యూర్షిప్, ఇండస్ట్రీ సహకారం, బిజినెస్ నెట్వర్కింగ్, అంతర్జాతీయ వ్యాపార అవకాశాలపై చర్చించారు. నేషనల్ చైర్మన్ కె.ఎం. చిస్టీ మాట్లాడుతూ, ఐ యం సి సి ఐ కేవలం మైనారిటీలకు మాత్రమే పరిమితమైన సంస్థ కాదని, అన్ని వర్గాలకు చెందిన వ్యాపారవేత్తలు, పరిశ్రమల ప్రముఖులు, ప్రొఫెషనల్స్ను కలుపుకొని విస్తృతమైన గ్లోబల్ బిజినెస్ వేదికగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో బిజినెస్ సమ్మిట్లు, అంతర్జాతీయ సమావేశాలు, ఇంటర్-కంట్రీ బిజినెస్ మీట్లను నిర్వహించి కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# ఏపీఎస్ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ శాఖల్లో విలీనం చేయాలి

**విజయవాడ (జయ జయహే)**



విజయవాడ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం, గొల్లపూడిలోసోమవారం జరిగిన ఏపీఎస్ఆర్టీసీ (పి.టి.డి) ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రస్థాయి సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య,పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర్ రావు, ప్రధాన కార్యదర్శి నరసయ్య సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో వివిధ కేటగిరీల్లో సుమారు 8,000 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సంవత్సరాలుగా ఆర్టీసీలో సేవలందిస్తున్నారని తెలిపారు.అయితే వారికి తగిన కనీస వేతనాలు లేకపోవడం, ఉద్యోగ భద్రత లేకపోవడం, ఆర్టీసీ కార్మికులుగా గుర్తింపు లేకపోవడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీలో ఖాళీలను ఔట్సోర్సింగ్ ఉద్యోగులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి అశోక్ మాట్లాడుతూఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ శాఖల్లోని ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలో విలీనం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని ఏఐటీయూసీ నాయకులు హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.



# ఇంటింటి ప్రచారంపై గంటా సమీక్ష

**విశాఖపట్నం, ఆగస్టు 24: (జయ జయహే)**

ఇంటింటికి తెలుగుదేశం లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో జీవీఎంసీ వార్డులు, భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఇంటింటి ప్రచారం మందకొడిగా జరుగుతోందని అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. ఏమైనా ఇబ్బందులుంటే తనకు తెలియజేయాలన్నారు. భీమిలి నియోజకవర్గం టీడీపీకి కంచుకోటని, గత ఎన్నికల్లో 93 వేల మెజారిటీ సాధించడం సహా లక్ష సభ్యత్వాలు చేసిన సంగతి గుర్తు చేశారు. ఇంటింటి ప్రచారంలో సరిగా పని చేయని బూత్ కన్వీనర్ లు, యూనిట్ ఇంచార్జీలను మార్చాలన్నారు. పార్టీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, సరగడ అప్పారావు, తాత్రాజు అప్పారావు, కోరాడ రమణ, తమ్మిన సూరిబాబు, జీరు సత్యం, గొలగాని నరేంద్ర, పాసి త్రినాథ్, నాగోతి సత్యనారాయణ, లొడగల జానకిరాం, కానూరు అచ్యుతరావు, చెట్టుపల్లి సన్యాసిరావు, పంచదార్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# నేత్రదానంపై విస్తృత అవగాహన కల్పించాలి

**నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ అభిషిక్త్**

**విశాఖపట్నం, ఆగస్టు 24, జయ జయహే**

నేత్రదానం ద్వారా మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని కలెక్టరేట్ మీటింగు హాలులో సోమవారం నేత్రదానంపై అవగాహన పోస్టర్‌ను సంబంధిత అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు నిర్వహించనున్న 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ప్రజల్లో నేత్రదానంపై విస్తృత అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా సూచించారు. మరణానంతరం నేత్రాలను దానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించే అవకాశం ఉంటుందన్నారు. అపోహలను తొలగించి, ప్రజలను స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందుకు వచ్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నేత్రదానం చేయాలనే సంకల్పాన్ని కుటుంబ సభ్యులకు ముందుగానే తెలియజేయడం ద్వారా మరణానంతరం నేత్రదానం సులభంగా జరిగేలా చూడవచ్చని పేర్కొన్నారు. డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, ప్రభుత్వ రీజనల్ కంటి ఆసుపత్రి సూపరింటిండెంట్ డా. మీనాక్షి, డీఎంహెచ్వో డా. జగదీశ్వరరావు, ఎన్టీఆర్ వైద్యసేవ కో-ఆర్డినేటర్ అప్పారావు, డీసీహెచఎస్ డా. నరేంద్ర సింగ్, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, నేత్రదాన సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సాధిక్‌కాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి



**మాడుగుల ఆగస్టు 24 జయ జయహే**

రాష్ట్ర బీజేపీ ఆదేశాల మేరకు సోమవారం మాడుగుల మండల బీజేపీ అధ్యక్షులు మెలిపాక స్వామి ఆధ్వర్యంలో మాడుగుల పోలీస్ స్టేషన్ పరిధిలో లవ్ జిహాద్ జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మాడుగుల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.అలాగే లవ్ జిహాద్ చేసిన సాధిక్ ఖాన్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మండల సతీష్, పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ ఎస్ ప్రసాద రావు, కూడా వెంకటేశ్వర్లు, ధర్మిశెట్టి నారాయణ రావు, కోట్ని వరహాలు రాజు, కోసూరు అప్పారావు, పుట్టా నాగేంద్ర, కోన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

# కళాభిమానులను ఆకట్టుకున్న జుగల్బందీ

**విశాఖపట్నం, ఆగస్టు 24, జయ జయహే :**

విశాఖలోని కళాభారతి నిర్వహిస్తున్న ఆరు రోజుల సంగీత, నృత్య, నాటక ఉత్సవాలలో మూడవ రోజైన సోమవారం నిర్వహించిన జుగల్బందీ కార్యక్రమాం కళాభిమానులను ఉర్రూతలూగించింది. ప్రఖ్యాత హిందుస్తానీ గాత్ర విద్వాంసులు శంకుమే దేవనాథ్ ఢిల్లీ నుంచి అలాగే సరోజ్ విద్వాంసులు మల్హార్ కలకత్తా నుంచి , హార్మోనియం కాశ్మీర్ నుంచి తబలా కలకత్తా నుంచి వచ్చి జుగల్బందీ కార్యక్రమం చేసి శ్రోతల కరతాల ధ్వనులను అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా అధ్యక్షులు ఎం ఎస్ ఎన్ రాజు, కార్యదర్శి రామదాసు డాక్టర్ రాంబాబు , కోశాధికారి కృష్ణ ప్రసాద్‌లతో పాటు ముఖ్య అతిథి డాక్టర్ డీఎస్ ఆనంద్, ట్రస్టీ రామ్ గోపాల్ జ్యోతి ప్రజ్వలనం చేశారు. అనంతరం ఆలపించిన పాటలను అద్భుతమైన రాగాలాపనతో మూడు గతులలో పాడి ప్రేక్షకుల హర్షద్వానాలను అందుకున్నారు. కర్ణాటక సంగీతంలో




ఎలాగైతే మృదంగానికి లయ విన్యాసం చేస్తారో ఈ కచేరీలు కూడా తబలకి లయ విన్యాసానికి అవకాశం కల్పించడంలో తబల విద్వాంసుడు 12 నిమిషాల పాటు అద్భుతంగా వివిధ జాతులలో వాయించి అందరి హర్షద్వానాలను అందుకున్నారు. కార్యదర్శి డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ మంగళవారం కార్యక్రమం




ప్రఖ్యాత కర్ణాటక గాత్ర విద్వాంసులు త్రిచూర్ బ్రదర్స్ గా పేరుగాంచిన సోదరులు ఇద్దరు చార్టెడ్ అకౌంట్ అయినా సంగీతాన్నే వృత్తిగా మార్చుకొని అద్భుతంగా గానం చేయనున్నారని అందరూ ఆహ్వానితులేని ప్రకటించారు. చివరగా అధికంగా వచ్చిన ప్రేక్షకులందరికీ బోధన రూపేనా ప్రసాద వితరణ జరిగింది.




# వందేమాతరం పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు

**యాక్మి ఆధ్వర్యంలో మాజీ సైనికులకు సత్కారం.**

**విశాఖపట్నం, ఆగస్టు 24, జయ జయహే :**

జాతి సమైక్యతను పెంపొందించే వందేమాతరం గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 29న వందేమాతరం శీర్షికన ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు యాక్మి స్వచ్ఛంద సాంస్కృతిక సేవాసంస్థ అధ్యక్షుడు యాక్మి ప్రతాప్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను సోమవారం ఉదయం సీతమ్మధారలోని తన క్యాంపు కార్యాలయంలో ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాక్మి ప్రతాప్ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈనెల 29 న ఉదయం 10 గంటలకు ద్వారకా నగర్ విశాఖ పౌర గ్రంథాలయంలో 25 మంది వీర జవాన్లతో పాటు క్రీడా, సాహిత్యం, రంగస్థలం, నృత్యం సంగీతం, కళా, సామాజిక రంగాల్లో సేవలందిస్తున్న వారికి ఘనంగా సత్కరిస్తున్నామని పేర్కొన్నారు. మరీ ముఖ్యంగా మన జాతీయ గేయం వందేమాతరం అవునత్యాన్ని ప్రమోట్ చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ప్రతాప్ కుమార్ తెలిపారు.

# తియ్యని కబుర్లతో కూటమి కాలక్షేపం

**- మాతృ భాషను పరిరక్షించమంటే మీనమేషాలు**

**- తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి**

**విశాఖపట్నం, ఆగస్టు 24, జయ జయహే**



మాతృభాషను పరిరక్షించడంలో ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి పేర్కొన్నారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా సోవ-ంవారం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని మాట నిలుపుకోవాలని కోరారు. మొన్నటి వర్షాకాల శాసనసభ సమావేశాలలో, విద్యాశాఖకు సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో..తెలుగుభాషను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకటరావు నివేదిక ఇచ్చారన్నారు. ఆ విషయమై స్పందించిన విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మాతృభాషను కాపాడుకోవాలని, తెలుగుభాష అమలుకు సభాసంఘం వేస్తామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. తెలుగుభాష రక్షణకు చర్యలు చేపట్టాలని రెండేళ్లుగా..భాషాభిమానులు, భాషోద్యమకారులు కూటమి ప్రభుత్వానికి ఎన్నోమార్లు విన్నపాలు చేశారని, కూటమి ప్రభుత్వం మాత్రం నమ్మకమైన వాగ్దానాలు చేస్తూ తియ్యగా కబుర్లు చెబుతుందన్నారు. చేతలు మాత్రం శూన్యమని విమర్శించారు. సుప్రీం కోర్టులో గత ప్రభుత్వం వేసిన, తెలుగుభాషా వ్యతిరేక వ్యాజ్యాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, మన తెలుగు గడ్డపై..అది ప్రభుత్వ బడైనా, పైసల బడైనా ప్రాథమిక విద్యాబోధన కచ్చితంగా తెలుగుభాషలోనే జరగాలని ఈ సందర్భంగా సూరి ప్రభుత్వాన్ని కోరారు. ఆంగ్లాన్ని ఒక పాఠ్యాంశంగా నేర్పుతూ యుద్ధ ప్రాతిపదికన "మాతృభాషాభివృద్ధి ప్రాధికార సంస్థ"ను ఏర్పాటు చేసి తీరాలన్నారు. తెలుగుభాష రక్షణకు అధికారికంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఔషధం పేరు చెప్పినంత మాత్రాన రోగం శాంతించదని, తగిన చర్యతోనే మనుగడ సాధ్యం అవుతుందన్నారు. ఈనెల 29 "తెలుగుభాషా దినోత్సవం" గిడుగు వారి జయంతి వేడుకల వేదికపై.. తెలుగుభాష రక్షణ విషయంలో స్పష్టమైన ప్రకటన కూటమి ప్రభుత్వం కచ్చితంగా చేయాలని సూరి పట్టుబట్టారు. ఈ కూటమి ప్రభుత్వం తన వైఖరిని తెలియజేసి మాటనిలబెట్టుకోవాలని కోరారు. అలా కానప్పుడు ఆఖరి పోరాటంగా "ప్రజా ఉద్యమం" చేస్తామని, తెలుగుభాషా ద్రోహుల భరతంపడతామని హెచ్చరించారు. తెలుగు భాషభిమానులందరం వచ్చే స్థానిక ఎన్నికలను ప్రభావితం చేస్తామని వక్కానించారు. తెలుగుభాషా సంస్కృతుల రక్షణ విషయంలో రాజీపడే సమస్యేలేదని తెలుగుదండు సూరి కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. , మాతృభాష రక్షకులకు పాలకట్ల సవారీ, మాతృభాష భక్షకులకు ఏడుకట్ల సవారీ కట్టి..తెలుగుభాషను భావితరాలకు భద్రంగా అందజేస్తామని ప్రతిజ్ఞ చేశారు.




# విజయవంతమైన జాబ్ మేళా

**మాడుగుల ఆగస్టు 24 జయ జయహే**

కే కోటపాడు మండలం చౌడువాడ గ్రామంలో స్కిల్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైంది. ఈ కార్యక్రమాన్ని శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 16 కంపెనీలు హాజరు కాగా, 89 యువతి, యువకులు పాల్గొన్నారు. సుమారు 40 మంది నిరుద్యోగులు వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో మండలం ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని

# గుజరాత్ నాయకత్వం కుట్ర




**సీఎం రేవంత్ రెడ్డి**

**తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంపై కేంద్రంపై మండిపడ్డ రేవంత్**

**కేంద్రం తనను అడ్డుకున్నా, తన లక్ష్యాన్ని అడ్డుకోలేరని వ్యాఖ్య**

**మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని సీఎం ఆగ్రహం**


**హైదరాబాద్, ఆగస్టు 24, జయ జయహే :**

తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్రలు చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కేంద్రం తనను అడ్డుకున్నా, తన లక్ష్యాన్ని మాత్రం అడ్డుకోలేరని అన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తామన్నారు. తన విదేశీ పర్యటనలో ఎలాంటి గోప్యతా లేదని, మొత్తం షెడ్యూల్‌ను విదేశాంగశాఖ ముందుంచామన్నారు. లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి, మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్రం, మోదీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 4 కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం : తెలంగాణ ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వకపోవడమనేది 4 కోట్ల ప్రజలకు జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని అడ్డుకోవడం అంటే అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. ప్రధాని మోదీ ఇప్పటికే ఎన్నో దేశాల్లో పర్యటించారని, ఆయన సొంత రాష్ట్ర సీఎం కూడా ఎన్నో దేశాల్లో పర్యటించారన్నారని రేవంత్ రెడ్డి అన్నారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి తమకు ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. హైదరాబాద్ ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులకు ఎన్నో సంస్థలు ఆసక్తి చూపించాయని వివరించారు. మన యూనివర్సిటీలతో ఒప్పందానికి విదేశీ వర్సిటీలు ఆసక్తి చూపాయన్నారు. ప్రఖ్యాత వర్సిటీలతో ఎంవోయూలు చేసుకునేందుకే తాను అమెరికా పర్యటన తలపెట్టినట్లుగా వివరించారు. విదేశీ వర్సిటీలు మన వద్దకు వస్తే, మన విద్యార్థులు అక్కడికి వెళ్లాల్సిన అవసరం ఉండదని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌లా వ్యవహరిస్తున్నారు : ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌లా వ్యవహరిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్ రాష్ట్రానికే రావాలని చూస్తున్నారన్నారని ఆరోపించారు. తన పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతామన్నారు. యూకే, యూఎస్ పర్యటనకు ఒకే తరహా వివరాలిచ్చామని రేవంత్ రెడ్డి తెలిపారు. లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చి, అమెరికా పర్యటనను మాత్రం ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. రాజకీయ కారణంతోనే అనుమతి ఇవ్వటం లేదని విదేశాంగశాఖ బదులిచ్చిందన్నారు. అసలు రాజకీయ కారణం అంటే ఏమిటి? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తాను తెలంగాణ సీఎం, కాంగ్రెస్ ముఖ్యమంత్రిని కావటమే రాజకీయ కారణమా అని ప్రశ్నించారు.

"వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారు. పెట్టుబడుల కోసం గుజరాత్ సీఎం అమెరికాలో 8 రోజులు పర్యటించారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి, తెలంగాణ సీఎంను ఎందుకు అడ్డుకున్నారు. తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని కేంద్రం, మోదీ పదేపదే ప్రదర్శిస్తోంది. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకునేందుకు కుట్ర చేశారు. నన్ను అడ్డుకోవటం, గుజరాత్ ఆధిపత్యానికి నిదర్శనం. రాజకీయ వివక్షతో తెలంగాణను మోదీ అడ్డుకుంటున్నారు. కేంద్రం వైఖరిపై రాష్ట్ర బీజేపీ నేతలు నోరెత్తకపోవటం మరింత అవమానం" – రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారు : కేంద్రంలో ఉన్న కొందరు బీజేపీ నేతలు తన అధికార పర్యటనపై అవాస్తవాలు చెప్పి కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. విదేశీ పర్యటనకు దరఖాస్తు చేసినప్పుడు అన్ని విషయాలు స్పష్టంగా పేర్కొన్నామన్నారు. అమెరికాలో ప్రఖ్యాత వర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని చెప్పామన్నారు. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నామని విదేశాంగ శాఖ బదులిచ్చిందని తెలిపారు.




## సీనియర్ మెగా అభిమానులకు

# రూ.5 లక్షల ప్రమాద బీమా

**విజయనగరం/హైదరాబాద్, ఆగస్టు 24, జయ జయహే :**

పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఆగస్టు 21న ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీనియర్ మెగా అభిమానులతో పాటు విజయనగరానికి చెందిన సీనియర్ మెగా అభిమానులు ఇంజరుపు నానాజీ, బలివాడ రవిశంకర్, కెల్ల కృష్ణారావు, త్యాడ రామకృష్ణారావు (బాలు)లకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల విలువైన ప్రమాద బీమాను కల్పించారు. శిల్పకళా వేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బాబీ సమక్షంలో, అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు రవణం స్వామినాయుడు చేతుల మీదుగా నలుగురు సీనియర్ మెగా అభిమానులు ప్రమాద బీమా పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇంజరుపు నానాజీ, బలివాడ రవిశంకర్, కెల్ల కృష్ణారావు, త్యాడ రామకృష్ణారావు మాట్లాడుతూ, "మెగాస్టార్ జన్మదిన వ...


## లారీ డ్రైవర్‌పై దాడి చేసిన బ్రేక్

# ఇన్‌స్పెక్టర్ డ్రైవర్..

**గాజువాకలో ఆందోళన చేపట్టిన ట్రెక్కర్స్ సంఘం**

**మల్కాపురం స్టేషన్లో కేసు నమోదు**

**విశాఖపట్నం, ఆగస్టు 24, జయ జయహే**



మధ్యప్రదేశ్ కు చెందిన ఓ లారీని ఆపమన్నా ఆపకుండా నడిపినందుకు ఆ డ్రైవర్ బైరోలాల్ సాహును గాజువాక రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్ పార్వతి డ్రైవర్ దాడి చేయడంపై సోమవారం న్యూ ఆంధ్ర మోటార్ ట్రెక్కర్స్ అసోసియేషన్ ఆందోళన చేపట్టింది. బాధితుడి జాడ లేకుండా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం గాజువాకలో ఆందోళన నిర్వహించారు. ఈ నెల 20వ తేదీన ఈ దాడి జరిగినట్టు న్యూ ఆంధ్ర మోటార్ ట్రెక్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. శేషగిరి సోమవారం మల్కా పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పై మల్కాపురం పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు నమోదు చేసి తదుపరి బైరోలాల్ సాహు ఆచూకీ కనుగొన్న తర్వాత వారిచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మల్కాపురం పోలీసులు తెలిపారు. అయితే విచక్షణా రహితంగా ఆ డ్రైవర్‌ను పిడి గుద్దులతో బలంగా కొట్టడం వల్ల ఆయన ఆరోగ్య పరిస్థితిపై అసోసియేషన్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. రక్తం కారుతున్నప్పటికీ కనికరం లేకుండా బ్రేక్ ఇన్‌స్పెక్టర్ డ్రైవర్ ఇలా ప్రవర్తించడాన్ని అంతా తప్పుబడుతున్నారు. ఆయనపై పోలీసులు కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# యువర్ అటెన్షన్ ప్లీజ్...ఆ రైళ్ల రూట్లలో మార్పులు

**పూరీ స్టేషన్‌లో అభివృద్ధి పనులు**

**నేటి నుంచి పలు రైళ్ల పాక్షిక రద్దు... పాక్షిక ప్రారంభం**

**విశాఖపట్నం, ఆగస్టు 24, జయ జయహే :**

ఖుర్దా రోడ్ డివిజన్ పరిధిలోని పూరీ రైల్వే స్టేషన్‌లో 5, 6వ ప్లాట్‌ఫారమ్‌ల అభివృద్ధి పనులకు సంబంధించి భద్రతాపరమైన ఆధునీకరణ పనులు చేపడుతున్నందున, పలు రైళ్ల రాకపోకలను మలతీపట్పూర్ (ఎంఎల్‌టీ) రైల్వే స్టేషన్ వరకు మాత్రమే పరిమితం చేసి, అక్కడి నుంచే తిరుగు ప్రయాణం ప్రారంభించేలా మార్పులు చేశారు. ఈ మార్పులను ప్రయాణీకులు గమనించాల్సిందిగా రైల్వే వర్గాలు కోరారు.

1. రైలు నం. 17480 తిరుపతి – పూరీ ఎక్స్‌ప్రెస్

తిరుపతి నుంచి ఆగష్టు 25, 26, 27, 29, 30 తేదీల్లో, అలాగే 1, 2, 3, 5, 6, 8, 9, 10, 12, 13, 15, 16, 17, 19, 20, 22, 23, 24, 26, 27, 29, 30 సెప్టెంబర్ 2026 తేదీల్లో మరియు 1, 3, 4, 6, 7, 8, 10, 11, 13, 14, 15, 17, 18, 20 అక్టోబర్ 2026 తేదీల్లో బయలుదేరే రైలు పూరీకి బదులుగా మలతీపట్పూర్ స్టేషన్‌లోనే ముగుస్తుంది.




2. రైలు నం. 17479 పూరీ -- తిరుపతి ఎక్స్‌ప్రెస్

తిరుగు ప్రయాణంలో 26, 27, 28, 30, 31 ఆగస్టు 2026 తేదీల్లో, 2, 3, 4, 6, 7, 9, 10, 11, 13, 14, 16, 17, 18, 20, 21, 23, 24, 25, 27, 28, 30 సెప్టెంబర్ 2026 తేదీల్లో మరియు 1, 2, 4, 5, 7, 8, 9, 11, 12, 14, 15, 16, 18, 19 అక్టోబర్ 2026 తేదీల్లో పూరీకి బదులుగా మలతీపట్పూర్ స్టేషన్ నుంచి తిరుపతికి బయలుదేరుతుంది.

3. రైలు నం. 22973 గాంధీధామ్ – పూరీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

28 ఆగస్టు 2026, 4, 11, 18, 25 సెప్టెంబర్ 2026 మరియు 2, 9, 16 అక్టోబర్ 2026 తేదీల్లో గాంధీధామ్ నుంచి బయలుదేరే రైలు పూరీకి బదులుగా మలతీపట్పూర్ స్టేషన్‌లోనే ముగుస్తుంది.

4. రైలు నం. 22974 పూరీ – గాంధీధామ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

తిరుగు ప్రయాణంలో 29 ఆగస్టు 2026, 5, 12, 19, 26 సెప్టెంబర్ 2026 మరియు 3, 10, 17 అక్టోబర్ తేదీల్లో పూరీకి బదులుగా మలతీపట్పూర్ స్టేషన్ నుంచి గాంధీధామ్‌కు బయలుదేరుతుంది. ప్రయాణికులకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నాము. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి, తదనుగుణంగా తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని కోరారు.

# దేశంలో జరుగుతున్న లవ్ జీహాద్ను అరికట్టాలి

**మునగపాక, ఆగస్టు 24, జయ జయహే:**

మునగపాక పోలీస్ స్టేషన్లో బిజెపి మండల అధ్యక్షుడు మళ్ళ కాళీశ్వరరావు సమక్షంలో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడం జరిగినది. కాళీశ్వరరావు మాట్లాడుతూ సాధిక్ ఖాన్ లవ్ జిహాదీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న ఏఈ నూకరాజు కుటుంబంకు న్యాయం చేయాలి. ఈ కేసులో వంచన మోసం దోపిడి హత్య లవ్ జిహాదీ ఉగ్రవాదం ఉన్నది. షాదిక్ ఖాన్ ని కఠినంగా శిక్షించాలి. రాష్ట్ర డీజీపి, హోం మంత్రి ఈ సంఘటనపై స్పందించాలి. కాకినాడలో ఇంటర్నేషనల్ స్కూల్ లో రైఫిల్ షూటింగ్ శిక్షకునిగా పని చేస్తూ పరిచయమైన సాధిక్ ఖాన్ లవ్ జిహాదీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న ఏఈ నూకరాజు కుటుంబంకు న్యాయం చేయాలి. ఈ కేసులో వంచన మోసం దోపిడి హత్య లవ్ జిహాదీ ఉగ్రవాదం ఉన్నది. షాదిక్ ఖాన్ ని కఠినంగా శిక్షించాలి, ఇతనికి సహకరించినవారిపై చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర డీజీపీ, హోం మంత్రి ఈ సంఘటనపై స్పందించాలి. హిందూ మహిళలకు బాలికలకు రక్షణ లేకుండాపోయింది. జిమ్ములు, జుంబా డాన్సులు, సెలూన్, బ్యూటీ పార్లర్ సెంటర్లు, కార్పొరేట్ సంస్థల కార్యాలయాలు, షాపింగ్ మాల్స్ ప్రధాన కేంద్రాలుగా లవ్ జహాజీలు పనిచేస్తున్నారు. వీరికి నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? వీరికి ఇన్వెస్ట్మెంట్ ఎవరు చేస్తున్నారు? ఏ మసీదులు, మదర్సాలు శిక్షణ ఇస్తున్నాయి? అనే విషయం పోలీసులు తెలుసుకొనే ప్రయత్నం చేయడం లేదు. సరికాదా యువత లో అవగాహన కలిగించే కార్యక్రమాలు కూడా నిర్వహించడంలేదు. ఈ సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది భారతీయ జనతా పార్టీ. లవ్ జిహాదీ సాదీక్ ఖాన్ ని కఠినంగా శిక్షించాలి అని కోరుచున్నది. అంతేకాకుండా, పోలీస్ లు లవ్ జిహాదీపై రాష్ట్రవ్యాప్తంగా పెడుతున్నటువంటి కేసులు ఏమిటి? చేస్తున్న సమీక్ష ఏమిటి? ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులు ఏమిటి? దీనిపై తీసుకున్నటువంటి చర్యలు ఏమిటి? ఎఫ్ఐఆర్ అయిన కేసులపై రిఫర్ చేసిన సంఘటనలు ఎన్ని? పూర్తి వివరాలుతో రాష్ట్ర డిజిపి మరియు హోం శాఖ మంత్రి మాట్లాడాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బొడ్డేడ భాస్కరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు దొడ్డి సత్యనారాయణ, మాజీ మండల అధ్యక్షుడు కన్నప్పరావు, మండల ప్రధాన కార్యదర్శి మొల్లేటి విశ్వనాథం, సూరిశెట్టి రామకృష్ణ, సూరిశెట్టి శ్రీనివాసరావు, మద్దాల సీతారాం, షేక్ మదీనా తదితరులు పాల్గొన్నారు.



Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1,
BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com